RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 51 | గురువారం, మార్చి 21, 2024 | పేజీలు : 4

### రాష్ట్రవ్యాప్తంగా “ఎర్త్ అవర్”.. గంటపాటు చీకటిగా ఐకానిక్ కట్టడాలు

న్యూఢిల్లీ: పర్యావరణ సమస్యలు, రోజువారీ విద్యుత్ వినియోగం ప్రభావం గురించి అవగాహన పెంచే ఎర్త్ అవర్ లక్ష్యం. ఈ శనివారం ఎర్త్ అవర్ పాటిస్తూ హైదరాబాద్‌లోని ఐకానిక్ బిల్డింగ్‌లు గంటపాటు చీకటిగా మారేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర సచివాలయం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహం, గోల్కొండ కోట, చార్మినార్, స్టేట్ సెంట్రల్ లైబ్రరీతో సహా అనేక ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో రాత్రి 8.30 నుండి 9.30 గంటల వరకు లైట్లు ఆఫ్ చేయనున్నారు. ఈ ఉద్యమం వ్యక్తులు, సంస్థలు, సంఘాలను అన్ని అనవసరమైన లైట్లను ఒక గంట పాటు ఆఫ్ చేయమని ప్రోత్సహిస్తుంది.

## దేశంలో అందరికీ... ఒకటే చట్టం - అమిత్ షా



న్యూఢిల్లీ మార్చి, 20 (సూర్యసేన ప్రతినిధి): ఇప్పుడు జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలలో బిజెపి 2014 ఎన్నికల కన్నా అధిక సీట్లను గెలుచుకుంటుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బుధవారం ధీమా వ్యక్తం చేశారు. అన్ని వారసత్వ పార్టీలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. లౌకిక దేశంలో ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలని విశ్వసిస్తున్న బిజెపికి ఈ ఎన్నికల్లో ఉమ్మడి పౌర స్మృతి(యుసిసి) అజెండాగా ఉండనున్నదని ఆయన తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్‌లో గత ఎన్నికలతో పోలిస్తే అధిక లోక్‌సభ స్థానాలను బిజెపి గెలుచుకుంటుందని న్యూస్ 18 రైజింగ్ భారత్ సమ్మిట్‌లో మాట్లాడుతూ అమిత్ షా విశ్వాసనం వ్యక్తం చేశారు. 1950 నుంచి యుసిసిని తాము లెవనెత్తుతున్నామని, దీని కోసం తమ పార్టీ పోరాడిందని షా చెప్పారు. దీని నుంచి తాము పక్కకకు తప్పుకోలేమని ఆయన అన్నారు. లౌకికవాద దేశంలో అందరికీ ఒకే చట్టం ఉండాలని తాము విశ్వసిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రజలకు బిజెపి ఇచ్చే కానుకగా యుసిసిని అభివర్ణించారు. పౌరసత్వ సవరణ చట్టంపై(సిఎఎ) ప్రతిపక్షాలు ప్రజలలో అపోహలు సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## ఢిల్లీ లిక్కర్ కేసులో... కీలక పరిణామం

న్యూఢిల్లీ మార్చి, 20 (సూర్యసేన ప్రతినిధి): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కవిత సహాయకులు రాజేష్, రోహిత్ రావులను ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి విచారణ కొనసాగుతోంది. కవితను అరెస్టు చేసిన రోజున వీరిద్దరి ఫోన్లను ఈడీ అధికారులు సీజ్ చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసులో కవిత సహాయకుల పాత్రపై క్లారిటీ కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు.
ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కవిత సహాయకులు రాజేష్, రోహిత్ రావులను ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి విచారణ కొనసాగుతోంది. కవితను అరెస్టు చేసిన రోజున



వీరిద్దరి ఫోన్లను ఈడీ అధికారులు సీజ్ చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసులో కవిత సహాయకుల పాత్రపై క్లారిటీ కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. సాక్షులుగా పరిగణిస్తూ నోటీసులు పంపడంతో రాజేష్, రోహిత్ రావు బుధవారం విచారణకు హాజరయ్యారు. మరోవైపు కవిత నాలుగవ రోజు విచారణ పూర్తయ్యింది. పలు అంశాలపై అధికారులు ప్రశ్నించారని తెలిసింది. ఇక ఈడీ కస్టడీలో ఉన్న కవితను మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు లాయర్ మోహిత్ బుధవారం కలిశారు.

### రాజకీయ స్టార్టప్‌లు లాంఛ్ చేయాలని చూశారు

## స్టార్టప్ మహాకుంభ్ వేదికగా రాహుల్‌పై మోదీ సెటైర్లు



న్యూఢిల్లీ మార్చి, 20 (సూర్యసేన ప్రతినిధి): అంకురాల (స్టార్టప్‌లు) అభివృద్ధి, వ్యాపార ఐడియాలపై మేథోమథనం సాగించేందుకు ఢిల్లీలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న స్టార్టప్ మహాకుంభ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. చాలా మంది రాజకీయ స్టార్టప్‌లను లాంఛ్ చేయాలని పలుమార్లు ప్రయత్నించారని కానీ వారికి, మీకు (నిజమైన స్టార్టప్‌ల) మధ్య వ్యత్యాసం ఏంటంటే మీరు నూతన ఆలోచనల వెంట పరుగులు పెడుతుంటారని రాహుల్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. మీ స్టార్టప్ ఆలోచన విఫలమైన అనంతరం మీరు మరిన్ని నూతన ఆలోచనలకు పదును పెడుతుంటారని అన్నారు. భారత్ సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటోందని వినూత్న రీతిలో అభివృద్ధి దిశగా పురోగిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ఇవాళ భారత్‌లో ఉత్సాహం, సానుకూల శక్తి వెల్లడవుతోందని, స్టాల్స్‌ను కలియతిరుగుతూ మీ ఆవిష్కరణలను చూసిన అనంతరం భారత్ రాబోయే రోజుల్లో ఎన్నో యూనికార్న్‌లు, డెకాకార్న్‌లకు వేదిక కానుందని భావిస్తున్నానని అన్నారు. భారత్‌లో ప్రస్తుతం వినూత్న అవకాశాలు వృద్ధి చెందుతున్నాయని, స్టార్టప్ కల్చర్ పెరుగుతున్నదని ప్రధాని వివరించారు. దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని చెప్పారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ కేంద్రమని, దేశంలో 1.25 లక్షలకు పైగా నమోదిత స్టార్టప్‌లున్నాయని, ఇందులో 110 యూనికార్న్‌లు కాగా స్టార్టప్‌ల్లో 12 లక్షల మందికి పైగా ఉద్యోగులున్నారని ప్రధాని పేర్కొన్నారు.

## తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్... ప్రమాణ స్వీకారం



హైదరాబాద్ మార్చి, 20 (సూర్యసేన ప్రతినిధి): తెలంగాణ ఇంఛార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ లోక్ ఆరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, రాష్ట్ర సీఎస్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రస్తుత జార్ఖండ్ గవర్నర్‌గా కొనసాగుతోన్న రాథకృష్ణన్ నేటి నుంచి తెలంగాణకు ఇంఛార్జి గవర్నర్‌గా అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. తమిళిసై ఇటీవల తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నూతన ఇంఛార్జి గవర్నర్‌గా నియమించారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్తో రాధాకృష్ణన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశాలు, రాష్ట్ర స్థితిగతులపై నూతన గవర్నర్ రాధాకృష్ణన్‌కు సీఎం రేవంత్ వివరించారు. కాగా రాధాకృష్ణన్ తమిళనాడు బీజేపీలో సీనియర్ నేత. గతంలో ఆ రాష్ట్రానికి బీజేపీ చీఫ్‌గా, కేరళ రాష్ట్ర ?వ్యవహారాల ఇంఛార్జిగా పలు కీలక పదవుల్లో పనిచేశారు. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేసి 2 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఆయన జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జార్ఖండ్‌తోపాటు తెలంగాణ ఇంఛార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

### సీఎం రేవంత్‌తో...

## ప్రత్యేక భేటీ




ఈ రెండు చోట్లా పూర్తిస్థాయి గవర్నర్లను నియమించేంత వరకూ సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు నిర్వర్తిస్తారని మంగళవారం రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. కాగా తెలంగాణకు గవర్నర్లుగా పనిచేసిన ECL నరసింహన్, తమిళిసై సౌందరరాజన్‌తోపాటు సీపీ రాధాకృష్ణన్ ఈ ముగ్గురూ తమిళనాడుకు చెందిన వారే కావడం విశేషం.

## కిషన్ రెడ్డి సమక్షంలో... బిజెపిలో చేరిన తమిళిసై



చెన్నై: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం చెన్నైలో తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కె అన్నామలై సమక్షంలో బిజెపిలో తిరిగి చేరారు. గవర్నర్ పదవిని నిర్వహించిన తరువాత బిజెపిలో చేరినందుకు ‘తమిళిసై సౌందరరాజన్‌పై వామ పక్షాలు, డిఎంకె చేసిన విమర్శలను’ అన్నామలై ప్రస్తావిస్తూ, ఉన్నత పదవులు నిర్వహిస్తున్న వ్యక్తులు పదవికి రాజీనామా చేసిన అనంతరం ఒక సాధారణ వ్యక్తిలా ప్రజల కోసం తిరిగి పని చేయనారంభించడం ఒక్క బిజెపిలోనే సాధ్యంఅని చెప్పారు. బిజెపి కాకుండా రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి ఉన్నత పదవులకు రాజీనామా చేయరని, వారికి రాజకీయాలలో ఉండడం అంటే ఉన్నత పదవులను అధిష్ఠించడమే అని ఆయన వ్యాఖ్యానించారు. ఆమె గవర్నర్‌గా చాలా చక్కగా పని చేశారని, ఆ పదవికి రాజీనామా చేసి తిరిగి రాజకీయాలలో చేరడం ప్రజలపై ఆమెకు గల ప్రేమను సూచిస్తోందని అన్నామలై తెలిపారు. తమిళిసై మళ్లీ బిజెపిలో చేరడం పార్టీ పట్ల ఆమె నిబద్ధతను సూచిస్తోందని, ప్రధాని నరేంద్ర మోడీ వరుసగా మూడవ సారి అధికారం చేపట్టినప్పుడు ఆయనకు మరింత బలం చేకూరేందుకు తన కృషి కూడా దోహదంచేయాలన్నది ఆమె దృఢనిశ్చయమని అన్నామలై పేర్కొన్నారు. 62 ఏళ్ల తమిళిసై సౌందరరాజన్ గైనకాలజిస్ట్. ఆమె రెండు దశాబ్దాల క్రితం బిజెపిలో చేరారు. బీజేపీ కాకుండా ఇతర రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి ఉన్నత పదవులకు రాజీనామా చేయరని, రాజకీయాల్లో ఉండడం అంటే ఉన్నత పదవులు చేపట్టడమేనని వ్యాఖ్యానించారు. తాను గవర్నర్‌గా చాలా బాగా పనిచేశానని, ఆ పదవికి రాజీనామా చేసి మళ్లీ రాజకీయాల్లోకి రావడం ప్రజలపై ఆమెకున్న ప్రేమను తెలియజేస్తోందని అన్నామలై అన్నారు. తమిళిసై మళ్లీ బీజేపీలో చేరడం, పార్టీ పట్ల ఆమెకున్న నిబద్ధతకు సంకేతమని, ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి అధికారం చేపట్టినప్పుడు ఆయన బలోపేతం కావాలనే ఆమె సంకల్పానికి నిదర్శనమని అన్నామలై పేర్కొన్నారు. 62 ఏళ్ల తమిళిసై సౌందరరాజన్ గైనకాలజిస్ట్. ఆమె రెండు దశాబ్దాల క్రితం బీజేపీలో చేరారు.

## పిఠాపురంలో పవన కల్యాణ్‌కు... షాక్


పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న పవన్ కల్యాణ్ కు ఎదురుదెబ్బ తగిలింది. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంనుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన శేష కుమారి వైసీపీ తీర్థం పుచ్చుకునేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.



ప్రస్తుతం ఆమె జనసేన నియోజకవర్గం ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి ఆమె అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వయంగా పోటీకి దిగడంతో శేషకుమారి అసంతృప్తికి లోనయ్యారు. ఇదే అదనుగా వైసీపీ ఆమెకు గాలం వేసింది. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంనుంచి వైసీపీ అభ్యర్థి పెండెం దొరబాబు 14 వేల మెజారిటీతో గెలిచారు. ఆయనకు 83 వేల ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి వర్మకు 68వేల ఓట్లు, జనసేన అభ్యర్థి శేషకుమారికి 28 వేల ఓట్లు వచ్చాయి. ఈసారి టిడిపి, జనసేన మధ్య పొత్తు కుదరడంతో పవన్ కల్యాణ్ గెలుపు ఖాయమని భావిస్తున్న తరుణంలో శేష కుమారి తీసుకున్న నిర్ణయం జనసేనకు షాక్ అనే చెప్పాలి.

## ఆసుపత్రిలో చేరిన సద్గురు జగ్గీ వాసుదేవ్..!

### బ్రెయిన్ సర్జరీ చేసిన ఢిల్లీ అపోలో వైద్యులు



న్యూఢిల్లీ: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆసుపత్రిలో చేరారు. ఆయన ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో మెదడు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ నెల 17న మెదడులో భారీ వాపు, రక్తస్రావం కావడంతో వెంటనే ఆయనను అపోలో ఆసుపత్రిలో చేరారు. అదే రోజు వైద్యుల బృందం ఆయనకు శస్త్ర చికిత్స నిర్వహించింది. సద్గురు ఆరోగ్యంపై జర్నలిస్ట్ ఆనంద్ నరసింహన్ సోషల్ మీడియాలో అప్‌డేట్ ఇచ్చారు. సద్గురు గత కొద్దిరోజులుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమాచారం మేరకు సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు డాక్టర్ వినీత్ సూరీ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. ఆయన సూచనతో ఎంఆర్ఐ చేయించుకున్నారు. పరీక్షల్లో మెదడులో భారీగా రక్తస్రావం జరిగినట్లుగా గుర్తించారు. 17న ఆరోగ్యం వేగంగా క్షీణించడంతో పాటు పలుసార్లు వాంతులు చేసుకున్నారు. తీవ్రమైన తలనొప్పితో ఆసుపత్రిలో చేరారు.

# సంపాదకీయం

## బీఆర్ఎస్, వైసీపీల ఆటకట్టు

భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందేందుకే బీజేపీ, ఇతర పార్టీల నేతలను అరెస్టు చేయిస్తుందని బూటకపు ప్రచారం చేస్తున్నవారు, అరిచి గగ్గోలు పెడుతున్నవారు అసలు తాము తప్పులు చేశామో లేదో ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఏదో ప్రజల ప్రయోజనాలకోసం, దేశం కోసం తాము అరెస్టు అవుతున్నామంటూ పిడికిళ్లు బిగించి భద్రతాధి కారుల వెంట వెళ్లేవారు, ధర్నాలు చేయించే వారికి తాము ఎన్ని వేల కోట్ల ప్రజాధనం స్వాయత్తం చేసుకున్నదీ కూడా తెలిసే ఉంటుంది. నిజానికి తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితను అరెస్టు చేయకపోవడానికి బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ కారణమని, ఆ రెండు పార్టీలూ ఒకటేనని కాంగ్రెస్ నేతలు బూటకపు ప్రచారం చేసి ఎన్నికల్లో ప్రయోజనం పొందారు. ఇప్పుడు కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసి తీసుకువెళితే కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని, రెండు పార్టీలు కలిసి ఆమెను అరెస్టు చేసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తే, అసలు ఈ అరెస్టు అంతా డ్రామా అని కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. నిజానికి ఢిల్లీ మద్యం కేసులో కవిత ఎప్పుడో అరెస్టయి ఉండాల్సిందని ఈడీ రెండు రోజుల క్రితం ఢిల్లీలో ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన కస్టడీ రిపోర్టును, అంతకు ముందు ఈడీ, సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్లను చదివిన వారికి అర్థమవుతుంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అక్రమంగా భారీ ఎత్తున లాభాలు ఆర్జించేందుకు వీలుగా ఆమె ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో ఎలా చేతులు కలిపారో, ఢిల్లీలోని ఒబెరాయ్, హైదరాబాద్‌లోని కోహినూర్ హోటళ్లలోనే కాకుండా తన నివాసంలో దళారులతో, వ్యాపారులతో ఎలా చర్చలు జరిపారో, ఎవరెవరితో ఏఏ వాట్సాప్ చాట్‌లో ఏమేమి మాట్లాడారో కేంద్ర దర్యాప్తు సంస్థలు పూసగుచ్చినట్లు వివరించాయి. ఆమెతో పాటు సౌత్ గ్రూప్‌లో ఉన్న భాగస్వాములు, బినామీలు అప్రూవర్లుగా మారి పలు సాక్ష్యాలు ఇచ్చారు. ఎంత మొత్తం హవాలా మార్గంలో మళ్లించారో తెలిపారు. ఆమె వ్యక్తిగత సిబ్బంది కూడా ఎవరెవరికి తాము డబ్బు సంచులు మోశామో తెలిపారు. సాక్ష్యాలు రూపుమాపేందుకు కవిత ఎన్ని ఫోన్లలో డేటాను తొలగించి ఎలా ఫార్మాట్ చేయించారో తెలిపారు. వీటన్నిటి ఆధారంగా ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టాలని ఈడీ ఎన్నోసార్లు ప్రయత్నించింది. కాని సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకున్నారు. అంతేకాక దాదాపు ఏడాది నుంచీ కవిత అరెస్టును తప్పించుకుంటూ ఏజెన్సీలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, రాజకీయ నాటకాలు ఆడుతూ కాలం వృధా చేశారు. కోర్టులకు తప్పుడు సమాచారంతో ఫిర్యాదులు చేస్తూ వాయిదాల ఆధారంగా పబ్బం గడిపారు. కాని ఎంత తప్పించుకున్నా ఏజెన్సీలు తమ పని తాము చేయకమానవు కదా.. ఎట్టకేలకు హైదరాబాద్ వెళ్లి అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకువచ్చారు. ఇక తాము ఎలాంటి తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆమెదే. కవిత మాదిరే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీ విచారణను తప్పించుకుంటూ కాలం గడుపుతున్నారు. అక్రమార్జనకు వీలు కల్పించే విధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించే విషయంలో కవిత, తదితరులతో కేజ్రీవాల్ చర్చించారని సాక్ష్యాలు ఉన్నప్పటికీ ఆయన ఈడీ ప్రశ్నలు ఎదుర్కోవడానికి సిద్ధంగా లేరు. ఈ కుంభకోణానికి సంబంధించి ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్ జైలులో ఉన్నారు. మొత్తం కుంభకోణానికి రూపకల్పన చేసిన కేజ్రీవాల్, దక్షిణాది వర్గానికి ప్రాతినిధ్యం వహించి రూ. 100 కోట్ల మేరకు ముడుపులు చెల్లించిన కవితల సాక్ష్యాలు సేకరిస్తే ఈడీ, సీబీఐ పని పూర్తవుతుంది. ఇప్పుడు కవిత అరెస్టు అయినందువల్ల కేజ్రీవాల్ అరెస్టుకు కూడా రోజులు దగ్గరపడుతున్నాయని ఈ కుంభకోణాన్ని అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఎంతకాలమని ఎవరైనా చట్టంతో దోబూచులాడుకుంటారు? అసలు తెలంగాణకు, ఢిల్లీకి సంబంధం ఏమిటి? కేజ్రీవాల్‌తో కేసీఆర్‌కు ఉన్న సంబంధాల వల్లే కదా, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ దాకా వెళ్లి లిక్కర్ వ్యాపారం చేసే సాహసం చేశారు. తెలంగాణ పేరుతో దోచుకునేందుకు తెర లేపినందువల్లే ఇవాళ భారత రాష్ట్ర సమితి అత్యంత సంక్షోభంలో ఉన్నది. ఆ పార్టీ త్వరలో అంతరించిపోయే పార్టీల్లో కలిసే సమయం ఆసన్నమైంది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరి పేటలో ప్రధాని నరేంద్రమోదీతో పాటు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొన్న భారీ బహిరంగ సభకు వచ్చిన బ్రహ్మాండమైన ప్రతిస్పందనను చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో కూడా జగన్మోహన్ రెడ్డి పార్టీకి నూకలు చెల్లినట్లు కనపడుతోంది. 2012లో అక్రమాస్తులు, మనీలాండరింగ్ కేసులో ఆయనను అరెస్టు చేసి, సీబీఐ 11, ఈడీ 7 కేసులు నమోదు చేసినప్పటికీ 12 సంవత్సరాలుగా విచారణను తప్పించుకుంటూ వస్తున్నారు. వందలాది డిశ్చార్జి పిటీషన్లను దాఖలు చేసి న్యాయప్రక్రియను ఆలస్యం చేస్తున్నారు.

# ఉమ్మడి శామీర్ పేట్ మండలంలో ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు





**శామీర్ పేట, (గరుడ వార్త) :** తూముకుంట మున్సిపాలిటీ తోపాటుగా శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాల్లో ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర నాయకుడు కాసుల ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ నివాసాని తరలివెళ్లి ఆయనను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా జగ్గంగూడ పరిధిలోని హోమ్ ఫర్ ది డిసబిలిటి అనాధాశ్రమంలో సుమారు 500 మందికి ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు, బిరియని అందించారు. శామీర్ పేట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రేడ్, బిస్కిట్స్ ప్యాకెట్లు అందజేశారు. అలాగే తుర్కపల్లిలో అంగన్వాడి స్కూల్లో చిన్నపిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ మంచినీళ్ళ లక్ష్మణ్, బీజేపీ మండల అధ్యక్షుడు కైరా యాదగిరి, బీజేపీ నాయకులు మాధవ రెడ్డి, కాసుల కరుణాకర్ గౌడ్, కాసుల ఈశ్వర్ గౌడ్ , శ్రీధర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, విక్రమ్ గౌడ్, నరేందర్ రెడ్డి, తుర్కపల్లి లో భావనాసి శ్రీనివాస్, నర్సింగ్ రావు, విక్రాంత్, నీరుడి అశోక్, శేఖర్, బూర్గు నరేందర్, కీసర నర్సింగరావు, తులసి కృష్ణ, ఎల్లం, గోదా శ్రీశైలం, రవి, రామాంజనేయులు, చిరంజీవి, విజయ్, కొణిదెల రాము, శ్రీనివాస్, సిహెచ్ వెంకటేష్, కొంగ బాలకృష్ణ ముదిరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు నిరోధించాలంటూ తాసిల్దార్‌కు వినతి



**శామీర్‌పేట (గరుడ వార్త) :** తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలోని దేవాదయ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేసి తగు చర్య తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ తూముకుంట మున్సిపాలిటీ ఓబీసీ సెల్ చైర్మన్ పెండెం లక్ష్మీనారాయణ తహసీల్దార్ యాదగిరి రెడ్డిని కోరారు. బుధవారం శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. దేవరయాంజాల్ పరిధిలో సర్వే నెంబర్ 63 లో తుంకుంట మున్సిపాలిటీ కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న ఇలాంటి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తూముకుంట మున్సిపాలిటీ కమిషనర్ కు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# 16 మంది అభ్యర్థులతో అన్నాడిఎంకె తొలి జాబితా



చెన్నై: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను అన్నాడీఎంకె బుధవారం ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి ఈ జాబితాను పార్టీ నేతల సమక్షంలో విడుదల చేశారు. జాబితా విడుదల సమయంలో డీఎండీకేతో పొత్తును పళనిస్వామి ప్రకటించారు. పొత్తులో భాగంగా డీఎండీకే 5 స్థానాల్లో పోటీ చేయనుండగా, పుదియ తమిళగం , ఎస్‌డీపీఐలు చెరో స్థానంలో పోటీ చేయనున్నాయి. ఈ సందర్భంగా పళనిస్వామి మాట్లాడుతూ తాము (అన్నాడీఎంకే ) బలంగా ఉన్నామని నమ్ముతున్నామని, ప్రజల మద్దతు తమకే ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. సోషల్ మీడియాలో ఎవరు ఏమనుకుంటున్నారో తాము పట్టించుకోమని, ప్రజలతోనే తమ అలయెన్స్ అని చెప్పారు. అన్నాడీఎంకె తొలి జాబితాలో 16 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. చెన్నై సౌత్ నుంచి కె. జయవర్ధన, చెన్నై నార్త్ నుంచి రాయపురం మనోహర్, కాంచీపురం నుంచి ఇ. రాజశేఖర్,అరక్కోణం నుంచి ఏఎల్ విజయన్, క్రిష్ణగిరి నుంచి వి. జయప్రకాష్, అరని నుంచి జీవీ గజేంద్రన్, విల్లుపురం నుంచి జె. భాగ్యరాజ్ , సేలం నుంచి పి. విఘ్నేష్, నమక్కల్ నుంచి ఎస్. తమిళ్‌మణి, ఈరోడ్ నుంచి అశోక్ కుమార్, కరూర్ నుంచి కేఆర్ ఎల్ తంగవేల్, చిదంబరం నుంచి ఎం. చంద్రహాసన్, మధురై నుంచి పి. శరవణన్, థేని నుంచి వీటీ నారాయణస్వామి, విరుధునగర్ నుంచి పి. జయపెరుమాళ్, నాగపట్నం నుంచి జి. సూర్జిత్ శంకర్ పోటీ చేయనున్నారు.

# లోక్‌సభ మొదటి దశ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ




న్యూఢిల్లీ: ఇరవై ఒక్క రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 102 పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడంతో అక్కడ నామినేషన్ ప్రక్రియ బుధవారం మొదలైంది. ఆ స్థానాలలో ఏప్రిల్ 19న తొలి దశ లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రపతి తరఫున ఎన్నికల కమిషన్ (ఇసి) జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, నామినేషన్ పత్రాల దాఖలుకు చివరి తేదీ ఈ నెల 27. అయితే, ఒక పండుగ కారణంగా బీహార్‌లో మొదటి దశ ఎన్నికలు జరగనున్న లోక్‌సభ సీట్లకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఈ నెల 28. బీహార్‌లోని 40 సీట్లలో నాలుగింటికి మొదటి దశలో వోటింగ్ జరుగుతుంది. నామినేషన్ పత్రాల పరిశీలన ఈ నెల 28న జరుగుతుంది. బీహార్‌లో మాత్రం 30న నామినేషన్ పత్రాలు పరిశీలిస్తారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణకు చివరి తేదీ 30, కాగా బీహార్‌లో అందుకు గడువు ఏప్రిల్ 2. 18వ లోక్‌సభకు ఎన్నికలు ఏప్రిల్ 19న మొదలవుతాయి. తదుపరి దశలు 26, మే 7, 13, 20, 25, జూన్ 1 తేదీలలో జరుగుతాయి. వోట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహిస్తారు. మొదటి దశలో పోలింగ్ జరగనున్న రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరి.

# వేసవిలో మొక్కలను సంరక్షించాలి: డిఆర్‌డిఓ



**శామీర్ పేట, (గరుడ వార్త):** గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన హరితహారం మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని డి ఆర్ డి ఓ సాంబశివరావు సూచించారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లోని పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం సమయానికి మొక్కలను సిద్ధం చేయాలని తెలిపారు. వేసవిలో నర్సరీలో పెరుగుతున్న మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, సమయానికి నీటిని అందించాలని చెప్పారు. జులైలో ఏర్పాటు చేసే హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే అనంతరంలోని గ్రామీణ ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ఎంపీడీవో మమతాబాయి, ఈసీ సూర్య, టి ఏ ఖదీర్ వెంకట్, ఫీల్డ్ అసిస్టెంట్లు కవిత, గురువేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మనం వినని ఆడవాళ్ళ కథలు తప్పక చెప్పాలి: సరితా జోషి



హైదరాబాద్: జీ థియేటర్ టెలిప్లే సకుబాయి ఇప్పుడు తెలుగు అండ్ కన్నడ భాషలలో అనువదించబడుతోంది. ఇందులో ప్రముఖ నటి టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. పరిస్థితులు ఆమెను వేదికపైకి నడిపించినప్పుడు ఆమెకు కేవలం ఏడు సంవత్సరాలు. ఈరోజు పద్మశ్రీ అండ్ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత సరితా జోషి వైవిధ్యమైన నటనతో థియేటర్, టెలివిజన్ అండ్ సినీ రంగాల్లో అపారమైన గుర్తింపు పొందారు సరితా జోషి. నాదిరా జహీర్ బబ్బర్ అండ్ క్లాసిక్ నాటకం సకుబాయి లో టైటిల్ రోల్ పోషించిన ప్రముఖ నటి జీ థియేటర్ దానిని తెలుగు అండ్ కన్నడ భాషలలోకి అనువదిస్తున్నందుకు సంతోషంగా ఉన్నారు. ఈ నాటకం ఇప్పుడు ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోబోతోందని తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎందుకంటే ఈ కథ, పాత్ర తన హృదయానికి చాలా దగ్గరగా ఉన్నాయన్నారు. సకుబాయి చాలా కష్టాలను అనుభవించిన ప్రతి మహిళకి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఆమెకు తనదైన సమస్యలు ఉన్నాయి, కానీ ఆమె నవ్విస్తుందన్నారు. పాడుతుంది.. నృత్యం చేస్తుంది.. ప్రతిదానిలో హాస్యాన్ని కనుగొంటుందని జోషి చెప్పారు. సకుబాయి వంటి మహిళల ప్రపంచాన్ని మరింత మంది చూసేందుకు, వారిని మరింత గౌరవం, సానుభూతితో చూసేందుకు ఈ కథ సహాయ పడుతుందని తాను ఆశిస్తున్నానని సరితా జోషి ముగించారు.

# రాహుల్ 'శక్తి' వ్యాఖ్యపై ఇసికి బిజెపి ఫిర్యాదు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'శక్తి' వ్యాఖ్యపైన, ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్ (ఇవిఎం)లపై ఆయన వ్యాఖ్యలపైన ఎన్నికల కమిషన్‌కు భారతీయ జనతా పార్టీ (బిజెపి) బుధవారం ఫిర్యాదు దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ఫిబ్రవరి 17న ముంబయిలో ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ, 'హిందూయిజంలో 'శక్తి' అనే ఒక పదం ఉంది. ఒక శక్తికి వ్యతిరేకంగా మేము పోరాడుతున్నాం' అని చెప్పారు. 'ఆ శక్తి ఏమిటనేదే ప్రశ్న. రాజు ఆత్మ ఇవిఎంలో ఉంది. అది నిజం. రాజు ఆత్మ ఇవిఎంలో, దేశంలోని ప్రతి సంస్థలో, ఇడి, సిబిఐ, ఆదాయం పన్ను (ఐటి) శాఖలో ఉంది' అని కూడా ఆయన చెప్పారు. వోటింగ్ యంత్రాలు లేకుండా ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికలలో గెలవలేరు అని కూడా రాహుల్ ఆరోపించారు.

# సిపిఐ నారాయణకు ప్రమాదం

హైదరాబాద్: సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ ప్రమాదంలో గాయపడ్డారు. మార్చి 16వ తేదీని ఓ పెళ్లి వేడుకకు హాజరయ్యారు. ఆయన వేదిక ఎక్కబోతుండగా జారిపడ్డాడు. చిన్న గాయం అని పట్టించుకోకుండా కార్యక్రమం నుంచి వెళ్లిపోయాడు. నొప్పి ఎక్కువగా వస్తుండడంతో వైద్యుడిని సంప్రదించాడు. వైద్య పరీక్షలో నారాయణకు పక్కటెముక విరిగినట్టు తేలింది. రెండు వారాలు విశ్రాంతి అవసరమని వైద్యులు ఆయనకు సూచించారు.

# భీమవరం ఫలితమే పిఠాపురంలో రిపీట్ కానుందా.. వైసీపీ ప్లాన్ ఇదేనా..?



సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడటం, అభ్యర్థుల ప్రకటన పూర్తయిన నేపథ్యంలో వైసీపీ అధినేత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విపక్ష పార్టీల ఎత్తులను చిత్తు చేసేలాగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా తమ రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఢీ కొట్టాలని వ్యూహం రచిస్తున్నారు. అందులో భాగంగానే జనసేన తరపున పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టడంతో పాటు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ కంటే తన రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తూ పవన్ కల్యాణ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదుర్కోవాలని తన ముందున్న అన్ని అవకాశాలపై దృష్టి సారించారు.

అందులో భాగంగానే పిఠాపురం నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి జనసేన పార్టీ సానుభూతిపరులు ఆ పార్టీకి అండగా నిలిచిన ముఖ్య నేతలు అలాగే పవన్ కల్యాణ్ గతంలో పోటీ చేసిన స్థానంలో ఉన్న ముఖ్య నేతలను వైసీపీలోకి ఆహ్వానిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఇప్పటికే కాపు ఉద్యమ నేతగా పేరు ఉన్న ముద్రగడ పద్మనాభంను వైసీపీలోకి ఆహ్వానించిన వైఎస్ జగన్, తాజాగా జనసేన పార్టీలో 2019 నుంచి అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆ పార్టీ సీనియర్ నేత మాకినీడు శేషు కుమారిని వైసీపీలో ఆహ్వానిస్తున్నారు. ఇక చాగోండి హరి రామ జోగయ్య కుమారుడు చేగొండి సూర్య ప్రకాష్ ను సైతం పార్టీలోకి తీసుకొచ్చారు వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మిధున్ రెడ్డి. ప్రస్తుతం వారి బాటలోనే మరికొందరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. పవన్ కల్యాణ్ కు అండగా ఉంటారని భావించి వారందరినీ చేర్చుకుంటున్నారు. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి దగ్గర చేసుకోవడంలో భాగంగానే వీరందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇస్తోంది వైసీపీ. కొత్తగా వైసీపీలో చేరే వారందరికీ రెడ్ కార్పెట్ వేస్తున్నారు.


ఇటీవలే పవన్ కల్యాణ్ తన పోటీ చేసే నియోజకవర్గం పిఠాపురం నుంచి బరిలో ఉంటానంటూ ప్రకటించిన నేపథ్యంలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా ఫోకస్ చేశారు వైఎస్ జగన్మోహన్ రెడ్డి. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న కాపు సామాజిక వర్గంలోని ముఖ్య నేతలను పార్టీలోకి ఆహ్వానించడంతోపాటు పవన్ కల్యాణ్ ఓటమి లక్ష్యంగా వైసీపీ పావులు కలుపుతోంది. ఇప్పటికే ఆ పార్టీ ఇంచార్జిగా ఉన్న మిథున్ రెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలను వైయస్ జగన్ అప్పగించారు. ఈ నేపథ్యంలో తెలవెనక రీజనల్ కోఆర్డినేటర్ గా ఉన్న మిథున్ రెడ్డి అన్ని తానే చక్రం తిప్పుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఇంచార్జిగా ఉన్న మిథున్ రెడ్డి ప్రస్తుతం చేగొండి సూర్య ప్రకాష్, ముద్రగడ పద్మనాభం తో పాటు మాకినుడు శేషు కుమారి లాంటి ముఖ్య నేతలను పార్టీలోకి తీసుకురావడంలో కీరోల్ పోషించారట. అయితే ఈ చేరికలతో పాటు పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ ఓటమి లక్ష్యంగా మరోసారి గెలిచి చూపించాలని కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

పిఠాపురం నియోజకవర్గంపై ప్రత్యేకంగా ఫోకస్ చేయడంతో పాటు అన్ని మండలాలకు ప్రత్యేకంగా బాధ్యులను నియమించింది వైసీపీ. పవన్ కల్యాణ్ పోటీ చేస్తారన్న సమాచారంతో పిఠాపురం నియోజకవర్గం నుంచి ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేగా పెండెం దొరబాబు ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఆయన తప్పించి వంగా గీతను వైసీపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. ఉన్నత విద్యావంతురాలు కావడం సీనియర్‌గా పాలిటిక్స్ లో మంచి పేరు సంపాదించుకోవడంతో వంగా గీత గెలుపు సాధ్యమని వైసీపీ భావిస్తోంది. పవన్ కల్యాణ్ నేరుగా బరిలోకి దిగుతూ ఉ ండటంతో ఎన్నికల్లో ఏమాత్రం ఫలితం తారుమారైనా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులో భాగంగానే నియోజకవర్గం పరిధిలో సామాజిక వర్గాల వారీగా ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పవన్ ఓటమే లక్ష్యంగా వైసీపీ పావులు కదుపుతోంది.

ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గం పరిధిలో కాపు సామాజిక వర్గం తర్వాత ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల ఓట్లు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఆయా వర్గాలను దగ్గర చేసుకునేందుకు ఇంచార్జిలను సైతం వైసీపీ నియమించింది. అందులో రీజనల్ కో ఆర్డినేటర్ గా ఉన్న మిథున్ రెడ్డిని ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గ టౌన్ బాధ్యతలను అప్పగించడంతో పాటు ముద్రగడ పద్మనాభం, పెండెం దొరబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, దాడిశెట్టి రాజాలకు ప్రత్యేకంగా బాధ్యతలను అప్పగించింది వైసీపీ అధిష్టానం.

పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం తరువాత అత్యధిక ఓటు బ్యాంకు కలిగి ఉన్న మత్స్యకార కుటుంబాలతో, ఆయా సంఘాలతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, మంత్రి దాడిశెట్టి రాజా. ఇక ముద్రగడ పద్మనాభం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పెండెం దొరబాబుతో పాటు మిథున్ రెడ్డిలు ప్రత్యేకంగా నియోజకవర్గంలోని ప్రతి మండలాలకు ఇంచార్జిలుగా బాధ్యతలను అప్పగించింది వైసీపీ. తద్వారా ఆయా వర్గాలకు పార్టీని దగ్గర చేసుకుని పవన్ కల్యాణ్ ఓటమే లక్ష్యంగా అడుగులు వేయబోతుంది వైసీపీ. అందులో భాగంగానే జనసేన పార్టీ తరపున 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన మాకినీటి శేషు కుమారిని వైసీపీలోకి ఆహ్వానించడం ద్వారా ఆ పార్టీకి దెబ్బకొట్టినట్లు అవుతుందని వైసీపీ భావిస్తోంది. ప్రస్తుతం 2019 ఎన్నికల్లో అభ్యర్థిగా బరిలో నిలిచిన మాకినీటి శేషు కుమారికి ఉన్న సొంత బలం కూడా వైసీపీకి లాభం చేకూరుస్తుందని భావిస్తున్నారు. అయితే అది ఏ మేరకు ఫలితం అయినా కూడా పవన్ ఓటమికి వైసీపీకి లాభం చేకూరుతుందని లెక్కలు వేసుకుంటుంది. దీనికి తోడు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమీకరణాల ఆధారంగానే పవన్ కల్యాణ్ వేస్తున్న ప్రతి అడుగులను వ్యూహాత్మకంగా దెబ్బ కొట్టాలని వైసీపీ భావిస్తోంది. పిఠాపురం నుంచి బరిలోకి దిగుతున్న పవన్ కల్యాణ్‌కు భీమవరం ఫలితాన్ని మళ్లీ పిఠాపురంలో రిపీట్ చేయాలని వైసీపీ భావిస్తోంది. సామాజిక వర్గాల విషయంలో ఎప్పుడు కొత్త లెక్కలు చెప్పే పవన్ కల్యాణ్‌కు తన సామాజిక వర్గం అధికంగా ఉండే నియోజకవర్గాల్లోనే రెండోసారి బరిలోకి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో అదే సామాజిక వర్గం నుంచి పవన్ కల్యాణ్‌ను దెబ్బ కొట్టేలా వైసీపీ రంగం సిద్ధం చేస్తోంది. చూడాలి మరి ఈ విషయంలో వైసీపీ వేస్తున్న అడుగులు ఏ మేరకు ఫలితాన్ని ఇస్తుందో..!

# రాజకీయ ప్రక్షాళన గురించి మోదీ మాట్లాడొచ్చా?



పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు సభలో చేసే ప్రసంగాలు, వేసే ఓటింగ్ మంచి చెడ్డలను విచారించే హక్కు (ఆ సమయంలో వారి అవినీతి, లంచగొండితనంపై క్రిమినల్ ప్రాసెక్యూషన్ చేపట్టే అధికారం) కోర్టులకు లేకుండా చేస్తూ వచ్చిన 1998 నాటి అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రద్దు చేస్తూ ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తాజాగా ఇచ్చిన తీర్పును ప్రధాని నరేంద్ర మోదీ వేనోళ్ల పొగిడారు. తీర్పు చాలా గొప్పదంటూ దానిని ప్రధాని స్వాగతించారు. రాజకీయాలను ప్రక్షాళన చేస్తుందని, వాటిపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని తీర్పు వెలువడిన వెంటనే (మాజీ ట్విట్టర్)లో వ్యాఖ్యానించారు. కోర్టులకు ఈడుస్తారనే భయంతో నిర్భయంగా మాట్లాడడానికి, ఓటు వేయడానికి పార్లమెంటు, శాసన సభల సభ్యులు వెనుకాడుతారని, అందువల్ల ప్రజాస్వామ్యానికి జరగవలసిన మంచి జరగదనే దృష్టితో రాజ్యాంగ కర్తలు వారికి కోర్టుల జోక్యం నుంచి రక్షణ కల్పించారు. అందుకు రాజ్యాంగంలో 105(2), 194 అధికరణలను చేర్చారు. మహోన్నత పార్లమెంటరీ ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ రక్షణ దుర్గం 1991లో పి.వి. నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని కాపాడడానికి ఝార?ండ్ ముక్తి మోర్చా సభ్యులకు లంచం ఇచ్చి ఓటు వేయించిన తప్పుడు పని వల్ల ఇప్పుడు కూలిపోయింది. ఈ రక్షణ కారణంగానే జేఎంఎం సభ్యులపై సీబీఐ కేసు నిలవలేదు. పార్లమెంటు సభ్యులు సభలో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు రాజ్యాంగ రక్షణ ఉ న్నందున జేఎంఎంపై సీబీఐ కేసు చెల్లదని 1998లో అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 తేడాతో తీర్పు ఇచ్చింది. ఇప్పుడు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దానిని కొట్టివేసింది. పార్లమెంటులో గాని శాసనసభల్లో గాని సభ్యులు ప్రసంగానికి, ఓటు వేయడానికి లంచం తీసుకొంటే ఇక నుంచి వారికి ఎటువంటి రక్షణ ఉండబోదని తాజా తీర్పు స్పష్టం చేసింది. ప్రధాని మోదీ ఈ తీర్పును ప్రత్యేక ప్రశంసలతో ముంచెత్తడం హృద్యంగా ఉంది. స్వచ్ఛ రాజకీయాల పట్ల ఆయన పార్టీకి గల మక్కువను అది చాటింది. కానీ దేశ రాజకీయాల్లో బీజేపీ వ్యాపింపజేస్తున్న దుర్గంధాన్ని, నియమోల్లంఘన ధోరణిని గమనించే వారికి ఏమనిపిస్తుంది? రవ్వంత అవినీతికి కూడా చోటు లేకుండా రాజకీయాలను కడిగిపారేయాలని, అవి కింది నుంచి పైవరకు ప్రక్షాళనకు గురి కావాలని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా కోరుకొంటూ ఉంటే దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ అధికారం కోసం బీజేపీ అడ్డ దారులు తొక్కడమేమిటి అనే ప్రశ్న వేధించడం సహజం. 2017 మార్చ్‌లో గోవా, మణిపూర్?లలో జరిగిన వాటిని పరిశీలిస్తే రాజ్యాంగ విహిత ప్రజాస్వామ్యానికి బీజేపీ ఎంత విరుద్ధమైన పార్టీయో అర్థమవుతుంది. అప్పుడు ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలన్నింటి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకొని ఏకైక అతిపెద్ద పార్టీగా ఎన్నిక కాగా రాజ్‌భవన్‌లను ఉపయోగించుకొని దాని నోటి ముందరి అధికారాన్ని బీజేపీ తన్నుకుపోయింది. ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయతగినంత స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, మిగతా పార్టీలన్నిటి కంటే ఎక్కువ సీట్లు గెలుచుకొన్న ఏకైక అతి పెద్ద పార్టీని గవర్నరు ఆహ్వానించాలని ఎస్.ఆర్.బొమ్మై కేసులో తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. 2017లో గోవా, మణిపూర్‌లో ఈ రాజ్యాంగ విధిని బీజేపీ కాల రాసింది. కాంగ్రెస్ కంటే చాలా తక్కువ స్థానాలు గెలుచుకొని కూడా తానే అధికారాన్ని కైవసం చేసుకొన్నది. ఈ రెండు రాష్ట్రాల్లో బలం లేకుండా అధికారాన్ని చెరబట్టిన బీజేపీ అందులో నిలదొక్కుకోడానికి అవసరమైన బలాన్ని చేరుకోడానికి ఎన్ని అడ్డదారులు, అవినీతి మార్గాలు తొక్కి ఉంటుందో చెప్పనక్కరలేదు, నేరుగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, లాభసాటి పదవులను ఎర వేయడం వంటివి చేసి ఎన్నికల్లో ప్రజల మొగ్గును బుగ్గిపాలు చేసిన వైనం ప్రజాస్వామ్య క్రీడా నియమోల్లంఘనకు పరాకాష్ఠ. ఇంత ప్రత్యక్షంగా బహిరంగంగా ప్రజా తీర్పును మంటగలిపిన పార్టీ అధినేతగా ప్రధాని మోదీ రాజకీయాల ప్రక్షాళన గురించి ఎలా నీతులు చెప్పగలుగుతారు? 2019లో మహారాష్ట్రలో ముఖ్యమంత్రి పదవిపై విభేదాలతో బీజేపీతో పొత్తుకు శివసేన గుడ్‌బై చెప్పి ఎన్‌సీపీ – కాంగ్రెస్‌లతో మెజారిటీ కూటమిని ఏర్పాటు చేసినప్పుడు ఎన్‌సీపీ నుంచి అజిత్ పవార్‌ను దువ్వి బీజేపీ ఆడిన నాటకం తెలిసిందే. అప్పటికి ఎన్?సీపీ శాసనసభా పక్ష నాయకుడుగా ఉన్న అజిత్ పవార్ నుంచి మొత్తం 54 మంది పార్టీ శాసనసభ్యుల మద్దతును ఇస్తున్నట్టు లేఖ రాయించుకొని, బీజేపీ తరఫున దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ఓ ఉ దయం రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించారు. దీని వెనుక తన చేయి ఉన్నట్టు ప్రచారం జరగడంతో శరద్ పవార్ రంగప్రవేశం చేసి చక్రం తిప్పేసరికి ఆ రోజు సాయంత్రానికల్లా కథ అడ్డం తిరిగింది. ఎన్?సీపీ శాసన సభ్యులు దాదాపు అందరూ శరద్ పవార్‌కు విధేయతను ప్రకటించడంతో బీజేపీ పన్నాగం నీరుగారిపోయి శివసేన – ఎన్‌సీపీ – కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాది కూటమి ప్రభుత్వ ప్రయోగం సఫలమయింది. రెండున్నర సంవత్సరాలపాటు ప్రజాభిమానం చవి చూస్తూ సాగిన ఈ ప్రభుత్వాన్ని ఏక్‌నాథ్ షిండేని ప్రయోగించి కేంద్రంలోని పెద్దలు కూల్చివేశారు. శివసేనను చీల్చి, ఫిరాయింపులను రక్తి కట్టించి ఈ ఘట్టాన్ని ఘనంగా జరిపించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టడానికి చేజిక్కిన ఏ చిన్న అవకాశాన్నీ మోదీ నీతిమంత పాలనలో బీజేపీ వదిలిపెట్టడం లేదు. చివరకు ఈడీని, సీబీఐనీ, ఆదాయపు పన్ను శాఖను సైతం బాహాటంగా దుర్వినియోగం చేస్తున్నది. బెంగాల్ నుంచి తమిళనాడు వరకు రాజ్‌భవన్‌ల దుర్వినియోగం జుగుప్సాకరంగా సాగిపోతున్నది. రాజ్యసభలో బలాన్ని దొడ్డిదారిలో పెంచుకోడానికి ఇటీవలి ఆ ఎన్నికల్లో పాల్పడిన అక్రమాలు తెలిసినవే. హిమాచల్‌ప్రదేశ్ నుంచి గల ఒకే ఒక ఖాళీ స్థానానికి జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింగ్వి సునాయసంగా గెలిచి వుండాల్సింది. బీజేపీ మీద కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు ఉన్నాయి. తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడం వల్ల సింగ్వి ఓడిపోయారు. బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్ గెలుపొందారు. ఇక్కడ విచిత్రమైన ఎన్నికల కమిషన్ నియమం ఒకటి కూడా కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేసింది. అభ్యర్థులిద్దరికీ చెరి 34 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయాల్సి వచ్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం డ్రాలో పైకి తీసిన చీటీలో పేరు గల వ్యక్తి ఓడిపోవాలి. ఆ విధంగా సింగ్వి ఓటమి పాలయ్యారు. ఇది మామూలు లాటరీ పద్ధతికి విరుద్ధమైనది. మామూలు పద్ధతిలో, తీసిన చీటీలోని వ్యక్తి గెలుపొందుతారు. ఈ సందర్భంగా సింగ్వి వెలిబుచ్చిన ఆవేదన మన భ్రష్ట క్రాస్ ఓటింగ్‌ను జరిపించేవారి చెంప చెళ్లు మనిపించింది. 'క్రాస్ ఓటింగ్ చేసిన ఆ తొమ్మిది మందికి కూడా (ఎమ్మెల్యేలు) కృతజ్ఞతలు తెలపదలిచాను. మానవ స్వభావం గురించి వారు నాకు చాలా నేర్పారు. ఓటింగ్ ముందు రోజు రాత్రి వారు నాతో కలిసి తాగారు, తిన్నారు. మరుసటి రోజే వ్యతిరేకంగా ఓటు వేశారు' అని సింగ్వి అన్నారు. బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది అనడానికి హిమాచల్ ప్రదేశ్‌లో అది నడిపించిన దుష్ట రాజకీయమే ఉదాహరణ. ఈ విషయంలో ఎటువంటి ప్రజాస్వామిక మర్యాదలు నియమాలైనా దాని దృష్టిలో దిగదుడుపే. సక్రమ ఎన్నికల నిర్వహణ అంటే దానికి అక్కసు. వాటిని మొక్కుబడి స్థాయికి దిగజారుస్తున్నది. ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికలను పర్యవేక్షించే ఎన్నికల కమిషన్ సభ్యులను ఎంపిక చేయడానికి భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రధాని, ప్రతిపక్షనేతతో కూడిన ఎంపిక కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చేసిన సూచనను దాని మొహం మీద కొట్టి పార్లమెంటు చట్టం ద్వారా ఏకపక్ష ఎంపిక కమిటీని నియమించిన పాలకులకు అవినీతి రహిత రాజకీయాల పట్ల గల మక్కువ ఎంతటిదో వివరించనక్కరలేదు. పార్లమెంటు, శాసనసభల సభ్యులు సభల్లో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఇస్తున్న ఏర్పాటును సుప్రీంకోర్టు రద్దు చేసినందుకు మహదానంద పడిపోయిన ప్రధాని మోదీ పార్టీ, ప్రభుత్వమూ కర్ణుడిని చంపినట్టు ప్రజాస్వామ్యాన్ని అన్ని వైపుల నుంచీ కుళ్లబొడుస్తున్న తీరు, ప్రతిపక్షాన్నీ ప్రశ్ననూ వధిస్తున్న పద్ధతి భారతీయులమైనందుకు మనందరం సిగ్గుతో తలదించుకొనేలా ఉన్నది.

# ప్రజావాణి వినరా......?



**సంగారెడ్డి :** ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి బ్రేక్ పడింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో నిలిపేస్తున్నామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6 వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉండదని వారు తెలిపారు. ప్రజావాణి లేదని తెలియక సోమవారం పెద్దసంఖ్యలో లబ్ధిదారులు సంగారెడ్డి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఫిర్యాదులు తీసుకోవడం లేదని తెలియడంతో నిరాశగా వెనుదిరిగారు. ఎన్నికల పేరిట దాదాపు రెండున్నర నెలల వరకు ప్రజావాణి నిలిపేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికే ఇంకో నెల సమయం ఉండడడంతో.. కనీసం అప్పటి వరకు ప్రజా సమస్యలు వింటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచే కోడ్ అమలులోకి వచ్చినా ఎన్నికల సంఘం నిబంధనలమేరకు ఇప్పటికే జరుగుతున్న (ఆన్‌గోయింగ్) ప్రభుత్వ కార్యక్రమాలన్నీ యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నది. ఈమేరకు ప్రజల సమస్యల పరిష్కారం 'ఆన్‌గోయింగ్' పరిధిలోకి రావా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలెవరూ రాజకీయ పార్టీలకు చెందరని, ఓటు మాత్రమే వినియోగించుకుంటారని వారు గుర్తు చేస్తున్నారు. అలాంటి వారు ఎదుర్కొనే సమస్యలు కనీసం చెప్పుకోవడానికైనా అధికారులు అనుమతించకపోతే ఎలా అని వారు అడుగుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ మొదలయ్యే వచ్చే నెల 18 నుంచి ప్రజావాణిని నిలిపివేస్తే అర్థముండేదని వారు అంటున్నారు. అప్పటి నుంచి అధికారులందరూ ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉండడంతో ప్రజావాణిని నిర్వహించడం, ప్రజల సమస్యలు పరిష్కరించడం సాధ్యమయ్యే అవకాశం ఉండదు.

# కోట్ల రూపాయల ఆదాయం.. అభివృద్ధి శూన్యం




**గద్వాల :** గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు ఒకప్పుడు ప్రత్యేక స్థానం ఉండేది. అన్ని ప్రాంతాల రైతుల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు నెలవుగా ఉండేది. ఉమ్మడి జిల్లాలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండేది. కానీ ప్రస్తత పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవడం, అకాల వర్షాలు వచ్చిన ప్పుడు ధాన్యం కొట్టుకుపోవటం తదితర సమస్యలు మార్కెట్‌ను వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొనుగోలుదారులకు, రైతులకు మార్కెట్ అధికారులు భరోసా ఇవ్వలేకపోతున్నారు. అన్ని పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే పరిస్థితిని కల్పించలేకపోతున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తగ్గిపోవడం, రైతులకు గిట్టుబాటు ధరలు అందకపోవడంతో ఇతర ప్రాంతాలకు పంట ఉత్పత్తులను తీసుకెళ్తుండటంతో మార్కెట్ కళ తప్పుతున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే మార్కెట్ ఫీజును మినహాయిస్తే, నేరుగా మార్కెట్‌కు వచ్చే ఆదాయం నిర్వాహణ, జీతభత్యాలకే సరిపోయే పరిస్థితి ఉంది. దానికి తోడు జీరోదందాను నిలువరించకపోవడంతో ఆదాయంపై ప్రభావం పడ్తోంది. వ్యవసాయ మార్కెట్‌కు నేరుగా వచ్చిన పంట ఉత్పత్తులను కమీషన్ మర్చంట్ల ద్వారా విక్రయించడంతో వచ్చే మార్కెట్ ఫీజు ఈ ఏడాది రూ. 2.33 కోట్ల వరకు వచ్చింది. ఇందులో వేరుశనగ విక్రయాల ద్వారానే రూ.1.49 కోట్లు వచ్చాయి. మిగిలింది అన్ని పంట ఉత్పత్తులు విక్రయించడం ద్వార వచ్చినదే ఉంది. ఆదాయం పెరగకపోవడం మార్కెట్ అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ దశలో జీరో దందాను నిలువరిస్తేనే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మార్కెట్‌కు నాలుగు గేట్లు ఉండటం, సీసీ కెమెరాలు లేకపోవడం, నిలువరించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మార్కెట్ ఆదాయంపై ప్రభావం పడుతున్నది. ఇక రెండవది.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వాటిపై సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చే మార్కెట్ ఫీజు. ఇది ఈ ఏడాది రూ. 1.61 కోట్ల వరకు వచ్చింది. మూడవది చెక్‌పోస్టుల నిర్వహణ ద్వారా రూ.24.16 లక్షలు, డైరెక్టు ఎగుమతులతో రూ.55.65 లక్షల మార్కెట్ ఫీజు వచ్చింది. ఇలా ఈ ఏడాది మొత్తంగా రూ.4.74 కోట్ల వరకు ఆదాయం లభించింది. మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన పాలక వర్గాలకు ఉంటే జీరోదందాను అరికట్టడంతో ఆదాయాన్ని పెంచి, అభివృద్ధి పథంలోకి నడిపించే అవకాశం ఉంది. గత పదేళ్లగా పాలకవర్గాలు అధికారం చెలాయించాయి తప్ప, అభివృద్ధిపై దృష్టి సారించలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో మార్కెట్‌లో మౌలిక సదుపా యాలు కరువయ్యాయి. రైతులకు సరైన వసతులు లేవు. మంచినీళ్లు, మరుగుదొడ్లు కూడా లేవు. రైతులు సేద తీరే షెడ్డు సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నది. దీంతో రైతులు మార్కెట్ షెడ్లకిందే సేదతీరాల్సి వస్తోంది.

# ఎన్నికల ప్రచారంలో అఖిలేష్ కుమార్తె



రాబోయే లోక్‌సభ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ భార్య, సమాజ్‌వాదీ పార్టీ నేత డింపుల్ యాదవ్ మెయిన్‌పురిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అఖిలేష్, డింపుల్‌ల కుమార్తె అదితి యాదవ్ కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మెయిన్‌పురి నుంచి డింపుల్ యాదవ్‌కు సమాజ్‌వాదీ పార్టీ లోక్‌సభ టిక్కెట్ కేటాయించింది. ములాయం సింగ్ యాదవ్ వారసత్వాన్ని కాపాడే బాధ్యత ఇప్పుడు డింపుల్ తీసుకున్నారు. ఈ ప్రాంత ప్రజలు ములాయం సింగ్‌ను 'దాదా' అని పిలిచేవారు. మెయిన్‌పురి సీటు 1996 నుంచి సమాజ్‌వాదీ పార్టీకి కంచుకోటగా ఉంది. మెయిన్‌పురిలో డింపుల్ యాదవ్‌తో కలిసి అఖిలేష్ యాదవ్ కుమార్తె అదితి యాదవ్ కనిపించారు. సమాజ్‌వాదీ పార్టీ డింపుల్ యాదవ్‌కు మెయిన్‌పురి స్థానం నుంచి మరోమారు పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. ములాయం సింగ్ మరణానంతరం డింపుల్ ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రస్తుతం మెయిన్‌పురి ఎంపీగా ఉన్నారు. అయితే ఇప్పుడు డింపుల్ గెలుపు అంత సులభం కాదని విశ్లేషకులు అంటున్నారు. యూపీలో నూతన రామాలయం ప్రారంభమైన నేపథ్యంలో ఇది సమాజ్‌వాదీ పార్టీ ఓటు బ్యాంకును తగ్గిస్తుందని పలువురు అంటున్నారు. ములాయంను తొలిసారిగా పార్లమెంటుకు పంపిన ఘనత మెయిన్‌పురి ప్రజలకే దక్కుతుంది. అప్పటి నుంచి ఈ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు గెలుస్తూనే ఉన్నారు. తేజ్ ప్రతాప్, ధర్మేంద్ర యాదవ్ కూడా ఈ స్థానం నుంచే పార్లమెంటు సభ్యులయ్యారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మెయిన్‌పురి జిల్లాలో 93.48 శాతం హిందూ జనాభా ఉంది. ఇక్కడ యాదవుల ఓట్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. 2019లో ఇక్కడ 17.2 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. యూపీలో ముస్లిం, యాదవ్ వర్గాలను సమాజ్‌వాదీ పార్టీ సంప్రదాయ ఓటర్లుగా పరిగణిస్తారు. ఇక్కడ ముస్లిం ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. యాదవుల ఓటు బ్యాంకుకు తోడు ములాయం సింగ్ ప్రభావం కారణంగా సమాజ్ వాదీ పార్టీ రెండు దశాబ్దాలుగా ఈ స్థానంలో తన హవా చాటుతోంది.

## ఆఫ్ఘన్‌పై పాక్ వైమానిక దాడులు....



**కాబూల్ :** ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. పౌర నివాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడిందని ఆఫ్ఘనిస్థాన్ అధికార ప్రతినిధి జబివుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్ వైమానిక దాడుల్లో పక్తికా ప్రావిన్స్‌లోని ఆరుగురు దుర్మరణం పాలయ్యారని చెప్పారు. వారిలో ముగ్గురు చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారని ముజాహిద్ తెలిపారు. ఖోస్ట్ ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులతో కుప్పకూలిన భవన శిథిలాల కింద చిక్కుకుని మరో ఇద్దరు మహిళలు మరణించారని చెప్పారు. ఈ దాడులను ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ అఫ్ఘానిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం అర్ధరాత్రి 3 గంటల సమయంలో ఈ వైమానిక దాడులు జరిగాయి. ఇటీవల ఆఫ్ఘనిస్థాన్ టెర్రరిస్టుల దాడుల నేపథ్యంలో పాకిస్థాన్ ఈ దాడులకు పాల్పడింది.

## 21 స్థానాల్లో డిఎంకె పోటీ



**చెన్నై :** తమిళనాడులోని అధికార డిఎంకె, మిత్రపక్షాలైన కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలతో లోక్‌సభ సీట్ల సర్దుబాటు పూర్తయింది. డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై చెన్నైలోని డిఎంకె ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో సోమవారం అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొత్తం 40 లోక్‌సభ స్థానాలకుగాను 21 స్థానాల్లో డిఎంకె పోటీ చేస్తుంది. తమిళనాడులో తొమ్మిది లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలో ఉన్న ఒక్క స్థానాన్ని కాంగ్రెస్‌కు కేటాయించింది. సిపిఎం, సిపిఐ, విసికె పార్టీలు రెండేసి స్థానాల్లో పోటీ చేస్తాయి. మధురై నుంచి సిట్టింగ్ ఎంపి ఎస్ వెంకటేశన్‌ను, దిండిగల్ నుంచి ఆర్. సచిదానందంను అభ్యర్థులుగా సిపిఎం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. వైకో నేతృత్వంలోని మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండిఎంకె)కు తిరుచిరాపల్లి నియోజకవర్గాన్ని, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)కు రామనాథపురం స్థానాన్ని డిఎంకె కేటాయించింది. చెన్నై నార్త్, చెన్నై సౌత్, చెన్నై సెంట్రల్, శ్రీపెరంబుదూర్, అరక్కోణం, కాంచీపురం (ఎస్‌సి), తిరువణ్ణామలై, వెల్లూరు, ధర్మపురి, కళ్లకురిచి, సేలం, పొల్లాచ్చి, నీలగిరి (ఎస్‌సి), కోయంబత్తూరు, తేని, అరణి, పెరంబలూరు, ఈరోడ్, తంజావూరు, తెన్కాసి (ఎస్‌సి), తూత్తుకుడి లోక్‌సభ స్థానాల్లో డిఎంకె పోటీ చేయనున్నది. తిరువళ్లూరు (ఎస్‌సి), కృష్ణగిరి, కరూర్, కడలూరు, మయిలాడుతురై, శివగంగ, విరుదునగర్, కన్యాకుమారి, తిరునెల్వేలి, పుదుచ్చేరి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయనున్నది. విడుతలై చిరుతైగల్ కట్చి (విసికె) పార్టీకి చిదంబరం (ఎస్‌సి), విల్లుపురం (ఎస్‌సి) స్థానాలు, సిపిఎంకు మధురై, దిండిగల్ సీట్లు, సిపిఐకు తిరుపూర్, నాగపట్నం (ఎస్‌సి) స్థానాలు ఖరారయ్యాయి. తిరుచిరాపల్లి సీటు నుంచి ఎండిఎంకె, నమక్కల్ స్థానం నుంచి కొంగునాడు మక్కల్ దేశీయ కచ్ (కెఎండికె), రామనాథపురం నుంచి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) పోటీ చేయనున్నాయి.

## బెంగళూరులో రోజుకు 50 కోట్ల లీటర్ల నీటి కొరత...!




బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరులో తీవ్ర నీటి సంక్షోభం నెలకొంది. రోజుకు 2600 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉండగా.. దాదాపు 500 ఎంఎల్‌డీ కొరత ఉందని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య తెలిపారు. సోమవారం అధికారులతో సమావేశమైన ఆయన.. సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు నిధుల కొరత లేదని, భవిష్యత్తులో ఈ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. "బెంగళూరులో మొత్తం 14 వేల బోరుబావులు ఉన్నాయి. వాటిలో 6900 ఎండిపోయాయి. కొన్ని జలవనరులు ఆక్రమణకు గురయ్యాయి. మహానగరానికి రోజుకు 2600 ఎంఎల్‌డి నీళ్లు అవసరం. కావేరి నుంచి 1470 ఎంఎల్‌డి వస్తున్నాయి. 650 ఎంఎల్‌డి బోరుబావుల నుంచి తీసుకుంటున్నాం. జూన్‌లో ప్రారంభం కానున్న 'కావేరీ ఫైవ్ ప్రాజెక్టు' ద్వారా చాలావరకు ఇక్కట్లు తీరతాయి. తాగునీటి అవసరాలకు కావేరి, కాబిని జలాలు జూన్ వరకు సరిపోతాయి. 313 చోట్ల కొత్తగా బోరు బావులు తవ్విస్తాం. 1,200 పునరుద్ధరిస్తాం" అని సీఎం సిద్ధరామయ్య తెలిపారు.

## 420లు 400 సీట్లు గెలుస్తామంటున్నారు



ఫోర్ ట్వంటీలు (మోసానికి పాల్పడినవారు) 400 సీట్లు గెలుస్తామంటున్నారంటూ ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజ్ బిజెపిపై మండిపడ్డారు. ఇవి అహంకారంతో కూడిన వ్యాఖ్యలని అన్నారు. కర్ణాటకలోని చిక్కమంగళూరులో ఆదివారం మీడియాతో ప్రకాశ్ రాజ్ మాట్లాడారు. ప్రధాని మోడీ, బిజెపి నేతలు తరచూ బిజెపి 370, ఎన్‌డిఎ 400 సీట్లు గెలుస్తుందంటూ వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో వారి పేర్లు ప్రస్తావించకుండానే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామని 420లు చెబుతున్నారు. అలా చెప్పే రాజకీయ పార్టీ కాంగ్రెస్ లేదా ఇతర పార్టీ ఏదైనా కావొచ్చు. అలా చెప్పడం అహంకారమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో ఒకే పార్టీ 400.. అంతకన్నా ఎక్కువ సీట్లు గెలుచుకునే అవకాశం లేదు. ప్రజలు ఓటు వేస్తేనే సదరు అభ్యర్థి గెలుస్తారు. అలాంటిది ఓ రాజకీయ పార్టీ, ఆ పార్టీ నేత తమ పార్టీ ఇన్ని సీట్లు గెలుస్తామని ఎలా చెబుతుంది. దీనిని ముమ్మాటికీ అహంకారం అనే అంటారు' అని ప్రకాష్‌రాజ్ అన్నారు.

## రష్యా అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్....



**మాస్కో :** రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ఎన్నికయ్యారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన రష్యా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను ఆ దేశ సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ (సిఇసి) సోమవారం అధికారికంగా ప్రకటించింది. పోలైన ఓట్లలో పుతిన్‌కు 87.28 శాతం ఓట్లు, కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థి నికోలవ్ ఖరితోనోవ్‌కు 4.31 శాతం, న్యూ పీపుల్ పార్టీ అభ్యర్థి వ్లాదిస్లావ్ డెవన్‌కోవ్‌కు 3.85 శాతం, లిబరల్ డెమొక్రాట్స్ అభ్యర్థి లెనిడ్ స్లుత్‌స్కీకు 3.20 శాతం ఓట్లు వచ్చాయి. పుతిన్ అభ్యర్థిత్వానికి ఏడు కోట్ల 50 లక్షలకుపైగా ఓటర్లు మద్దతు పలికారు. 200 నుంచి 2008 వరకూ అధ్యక్షుడిగానూ, 2008 నుంచి 2012 వరకూ ప్రధానిగానూ, మళ్లీ 2012 నుంచి ఇప్పటివరకూ అధ్యక్షుడిగానూ పుతిన్ బాధ్యతలు నిర్వహించారు. తాజా ఎన్నికతో 2030 వరకూ అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఈ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 74 శాతం ఓటింగ్ నమోదయింది. 2018 ఎన్నికల్లో 67.47 శాతం ఓటింగ్ మాత్రమే నమోదయింది. పుతిన్ ఎన్నికకావడం పట్ల భారత ప్రధాని నరేంద్రమోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ, ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్‌ఉన్ తదితరులు అభినందనలు తెలిపారు. 200 నుంచి 2008 వరకూ అధ్యక్షుడిగానూ, 2008 నుంచి 2012 వరకూ ప్రధానిగానూ, మళ్లీ 2012 నుంచి ఇప్పటివరకూ అధ్యక్షుడిగానూ పుతిన్ బాధ్యతలు నిర్వహించారు. తాజా ఎన్నికతో 2030 వరకూ అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఈ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 74 శాతం ఓటింగ్ నమోదయింది. 2018 ఎన్నికల్లో 67.47 శాతం ఓటింగ్ మాత్రమే నమోదయింది.

## ఇసిపై ప్రధాని మోడీ ప్రభావం!

ఎన్నికల తేదీ, తదితర కార్యక్రమం వెలవడునున్న తరుణంలో ఎన్నికల కమిషన్ అధికారి అరుణ్ గోయల్ హఠాత్తుగా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అంతకు మునుపే ఒక కమిషనర్ పదవీకాలం పూర్తి అయినందున పోస్ట్ వేకెంటుగా ఉంది. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రమే పదవిలో మిగిలారు. ఆయన ఒక్కరే రాబోయే లోకసభ ఎన్నికలను నిర్వహిస్తారా అన్న మీమాంస తలెత్తిన సమయంలో ప్రధానమంత్రి గురువారం మధ్యాహ్నం ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియను సజావుగా పూర్తి చేశారు. సుఖ్బీర్ సింగ్ సంధు (ఉత్తరాఖండ్), గ్యానేశ్వర్ కుమార్ (కేరళ)ఎన్నికల కమిషనర్ గా వ్యవహరిస్తారు. కేవలం ప్రధానమంత్రి మోడీ మాట మాత్రమే చెల్లుబాటు అయ్యే రీతిలో ఈ నియామకాలు జరిగిపోయాయి. ఇంతకుముందు ఎన్నికల కమిషనర్ ను నియమించే కమిటీలో ప్రధానమంత్రి తోపాటు లోక సభ ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండేవారు. కానీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఈ కమిటీలో స్థానం ఉండటం మోడీకి ఇష్టం లేదు. అందుకే, గత మార్చిలో సుప్రీంకోర్టు నిర్దేశించిన సుప్రీంకోర్టు మాట చెల్లకుండా చేయడానికి మోడీ ప్రభుత్వం హడావుడిగా ఎన్నికల కమిషనర్ల నియామక విధివిధానాల చట్టాన్ని మార్చివేసింది. అంతేకాకుండా ఆ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్థానం లేకుండా చేసారు. కొత్త కమిటీలో ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గ సభ్యుడు ఒకరు ప్రతిపక్ష నాయకుడు మాత్రమే సభ్యులుగా ఉంటారు. అయితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా స్థానం లేకుండా చట్టం తీసుకురావడాన్ని సవాల్ చేస్తూ ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్), కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాగూర్ కూడా సుప్రీంకోర్టులో గతంలోనే పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై రేపు విచారణ జరగవలసిన సమయంలో అర్జెంట్‌గా మోడీ ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియమాకాన్ని హడాహుడిగా పూర్తి చేశారు. ఈ కమిటీలో సభ్యుడైన లోక్ సభ కాంగ్రెస్ పక్ష నాయకుడు అధీర్ రంజన్ కొత్త చట్టం తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. అంతే కాక గురువారం జరిగిన నియామక పద్ధతి మీదకూడా అభ్యంతరాలు లేవవనెత్తుతూ ఒక అసమ్మతి పత్రాన్ని సమర్పించాడు. అయితే ఈ అసమ్మతి పత్రాన్ని ఖాతరు చేసేవారెవరు? అసమతి తెలియజేశాను అన్న ఆత్మ సంతృప్తి మాత్రమే ఆ ప్రతిపక్ష నాయకుడికి దిక్కింది. ఈ ముగ్గురు సభ్యులలో ఇద్దరు ప్రభుత్వానికి చెందిన వారే కనుక ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ఇక అసమ్మతికి, భిన్న అభిప్రాయానికి తావుండే అవకాశం లేదు. కనుక మోడీ మాటే అంతటా, అన్నివేళలా చెల్లబాటు అవుతుంది. ఈ ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ గురువారం సమావేశం అయింది. దీనికి అనుసరించిన తీరు అందులో ప్రస్తావనకు వచ్చిన పేర్లు కూడా అంతా ఒక పథకం ప్రకారమే గుట్టుగా జరిగి పోయినట్లు స్పష్టంగా కనపడుతుంది. అధీర్ రంజన్ చౌదరి బుధవారం అర్ధరాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ఆయనకు గురువారం మధ్యాహ్నం సమావేశం ఉంటుందని సమాచారం అందించారు. ఆయనకు 212 మంది పేర్లతో కూడిన ఒక జాబితాను పంపించారు. అంత తక్కువ సమయంలో పొడవైన జాబితా పరిశీలించి ఒక అభిప్రాయం చెప్పడం కష్టం. లేదా అభ్యంతరాలు చెప్పే అవకాశం అంటూ ఉండదు కనుక, ఈ జాబితాను షార్ట్ లిస్ట్ చేసిన జాబితా పంపాలని కోరితే, సరిగ్గా సమావేశం జరగటానికి కొద్దిగా ముందు ఆరుగురి పేర్లతో ఒక లిస్ట్ పంపించారు. ఈ కమిటీలో సభ్యుడైన ప్రతిపక్ష నాయకుడి మాటకు ఎట్టి పరిస్థితుల్లోనూ విలువ ఇవ్వకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలా లాంచన చర్యతో ఉదాసీనంగా వ్యవహరించింది. ప్రభుత్వం అనుకున్నట్టే నియామకాలు కూడా జరిగిపోయాయి. ఎన్నికల సంఘంలో సభ్యులుగా ఎవరైతే నేమి అన్న అహంకార ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అలాగే తన మాటకు తిరుగుండదని కాబోలు సిబిఐ విజిలెన్స్ కమిషన్ కన్నా ఎక్కువ స్వతంత్ర ప్రతిపత్తితో మెలగవలసిన వ్యవస్థ ఎన్నికల కమిషన్ ది. కేంద్ర దర్యాప్త సంస్థలు ఏలాగు మోడీ గుప్పెట్లోనే ఉన్నాయి అనే విషయం ప్రతి రోజూ సర్వత్రా వినపడే విషయమే. భారత రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు ఒక విశేషమైన ప్రత్యేక ప్రతిపత్తి స్థానాన్ని కల్పించింది. ఆ కమిషన్ వ్యవహారంలో ప్రభుత్వం చేసుకోవడానికి వీలుండదు. ఇలాంటి వెసులుబాటు ఉంటేనే కానీ, మన ప్రజాస్వామ్యానికి గుండెకాయవంటి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగదు. కానీ ఎన్నికల ప్రక్రియ క్రమం అంతా తన ఇష్టాను సారమే జరగాలన్నది మోడీజీ పంతమైనప్పుడు రాజ్యాంగాన్ని మాత్రం ఆయన ఏలా ఖాతర్ చేస్తారు ? ఏ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలో, అంతా మోడీ ఇష్ట ప్రకారమే జరగడం మొదలయి చాలా కాలమే అయింది. గత బెంగాల్ శాసనసభ ఎన్నికలు నిర్వహించిన తీరు దీనికి ప్రబలమైన ఉదాహరణగా చెప్పుకోవాలి. మోడీజీకి కావలసింది రాజ్యాంగ పరిరక్షణా వ్యవస్థలు కావు. తన మాట తూచా తప్పకుండా పాటించే విధేయ సంస్థలే కావాలి. 2019 ఎన్నికల్లో మోడీ, అమిత్ షా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించాలన్న ఫిర్యాదులు వస్తే అప్పటి ఎన్నికల కమిషన్ అధిపతి 'అశోక్ లవాస' ఏదో చర్య తీసుకోవాలన్న ఆలోచన చేస్తే ఆయన కుటుంబంపై సిబిఐ లాంటి సంస్థలను ఉపయోగించారు. ఆయన ఒత్తిడులను తట్టుకో లేక విధిలేని పరిస్థితుల్లో ఆయన తన పదవికి రాజీనామా చేసి పోయేదాకా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడులు తెచ్చింది. లవాసాను అక్షరాల ఎన్నికల కమిషనర్ పదవినుంచి తరిమేశారు. ఈ నేపథ్యంలో కొత్త కమిషనర్లు కచ్చితంగా మోడీ మనస్సు ఎరిగి నడుచుకొనే వారే అయి ఉంటారేమో చూడాలి.

# డ్రై ఫ్రూట్స్ రోజూ తింటే అనారోగ్యమా...?



డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచివి.అయితే ప్రతి రోజూ డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం అంటారు. కానీ అది ఏమాత్రం నిజం కాదు. అయితే వీటిని తినడానికి సరైన సమయం తెలుసుకోవటం మంచిది.డ్రై ఫ్రూట్స్ తినేముందు వాటిని రాత్రంతా నీళ్లలో నానబెట్టి, ఉదయాన్నే పొట్టు తీసి తినాలి. ఇలా చేయడం వల్ల గింజల్లో వేడి కలిగించే గుణం తగ్గుతుంది. అలాగే ఫైటిక్ యాసిడ్ ఇంకా టానిన్ విడుదల అవుతుంది. దీని వల్ల మనం వాటి నుంచి పోషకాలు గ్రహించడం సులభమవుతుంది. ఒకవేళ మీరు వాటిని నానబెట్టడం మర్చిపోతే.. డ్రై రోస్ట్ చేసి తినడం మంచిది. ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి రోజూ 15 నుండి 25 గ్రాముల డ్రై ఫ్రూట్స్ తినవచ్చునని చెబుతున్నారు.డ్రై ఫ్రూట్స్ పొద్దున్నే తినడం మంచిదని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. వేడి స్వభావం కలిగిన డ్రై ఫ్రూట్స్ నీటిలో నానబెట్టి, వాటి పై తొక్క తీసి తర్వాత తినాలి. ప్రతిరోజూ 15 నుండి 25 గ్రాముల డ్రై ఫ్రూట్స్ తినవచ్చు. కానీ, వయస్సు, ఆరోగ్య పరిస్థితిలను దృష్టిలో ఉంచుకుని తింటే మంచిది.


డ్రై ఫ్రూట్స్ జీర్ణక్రియ ప్రక్రియకు మద్దతునిస్తాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో డ్రైఫ్రూట్స్ తినడం మంచిదని చెబుతున్నారు. లేదంటే, సాయంత్రం స్నాక్‌గా కూడా నట్స్ తినొచ్చని సూచిస్తున్నారు. ఇలా తింటే.. ఎక్కువగా ఆహారం తినాలనే కోరిక తగ్గుతుందని చెబుతున్నారు.డ్రై ఫ్రూట్స్‌లో విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం బలపడుతుంది. డ్రై ఫ్రూట్స్ శక్తిని కలిగి ఉంటాయి. ఇది రోజంతా మీకు శక్తిని ఇస్తుంది. కొన్ని డ్రై ఫ్రూట్స్, ముఖ్యంగా బాదంపప్పులో విటమిన్ ఇ, ఫైబర్, ఫోలిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి గుండె సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. ఆకలి తగ్గుతుంది. నోటి అందాన్ని కాపాడుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే ప్రొటీన్లు, మినరల్స్, క్యాల్షియం శరీర కండరాలను నిర్వహించడానికి సహాయపడతాయి.

# ఈ ఆకు రసం తాగితే కీళ్ల నొప్పులు పరార్..!



మన పూర్వీకుల నుంచి పుదీనా వంటలలో ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. ఇది రుచికి రుచి సువాసన కూడా కలిగి ఉంటుంది.. పుదిన వివిధ వ్యాధులను కూడా నయం చేయడానికి వంటలలో ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.పుదీనా ఆకులు వేడి వాతావరణం లో కూడా శరీరాన్ని చాలా చల్లగా ఉంచేలా చేస్తుంది. పుదీనా ఆకులను నమ్మడం వల్ల కూడా నోటిలో ఉండేటువంటి దుర్వాసనను కూడా తొలగించేలా చేస్తుంది. అంతేకాకుండా దంతాలకు కూడా మేలు చేస్తుందని చెప్పవచ్చు. మరి పుదీనా వల్ల మరికొన్ని ప్రయోజనాలను తెలుసుకుందాం. పుదీనా ఆకు రసం నొప్పి నివారణగా పనిచేస్తుంది. ఏదైనా సందర్భంలో తలనొప్పి వచ్చినప్పుడు పుదీనా టీ తాగడం లేదా ఆకులను నమ్మలడం వల్ల వాటి నుంచి ఉపశమనం పొందవచ్చు. పుదీనా ఆకుల పేస్ట్ కీళ్ల నొప్పిలను కూడా తగ్గిస్తుంది.. పుదీనా ఆకులలో ఉండేటువంటి అమ్మినోయాసిడ్, పొటాషియం ,జింక్ వంటివి చర్మాన్ని తేమగా మృదువుగా ఉంచేలా చేస్తాయి. పుదీనా ప్యాక్ వల్ల చర్మం మీద మొటిమలు కూడా తగ్గడమే కాకుండా చర్మం కాంతివంతంగా మెరుస్తుంది. జలుబు దగ్గుతో ఇబ్బంది పడేవారు పుదీనా ఆకులను తినడం చాలా మంచిది. పుదీనా ఆకులను మరిగించి ఆ నీటితో స్నానం చేయడం వల్ల బ్యాక్టీరియా దుర్వాసన కూడా తగ్గిపోతుంది. అలాగే దురదను కూడా తగ్గించడానికి ఈ పుదీనా చాలా సహాయపడుతుంది. జీర్ణ క్రియను బలోపేతం చేయడానికి కూడా పుదీనా సహాయపడుతుంది. జుట్టు రాలిపోతుంటే రెండు మూడు రోజులపాటు పుదీనా ఆకులను బాగా నూరి తలకు పట్టించడం వల్ల జుట్టు చాలా ఒత్తుగా పెరుగుతుంది. ఏదైనా గాయాలు అయినప్పుడు లేకపోతే కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడేవారు పుదీనా రసాన్ని కాళ్లకు రాసుకొని తిప్పుకోవడం వల్ల నెమ్మదిగా నొప్పులు సైతం మటుమాయం అవుతాయి.. పుదీనా ఆయిల్ తో నైనా నరే మసాజ్ వంటివి చేయించుకోవడం వల్ల మంచి లాభాలు లభిస్తాయి.

# మంచినీరు రోజుకు ఎన్ని తాగాలో తెలుసా..?



ప్రతిరోజు తగినన్ని నీరు తీసుకోవాలని వైద్యులు చెబుతూ ఉంటారు. మీరు ఎంత బాగా తాగితే ఆరోగ్యం అంత బాగా ఉంటుందని, అలాగే అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు అని చెబుతూ ఉంటారు.ప్రతిరోజు మనిషి ఖచ్చితంగా తప్పకుండా రెండు లీటర్ ల నీరు కంటే ఎక్కువ నీదే తాగాలని చెబుతూ ఉంటారు. లేదంటే గ్లాసులతో పోలిస్తే కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగాలి. కానీ మనం ప్రస్తుతం పనుల్లో పడి కనీసం మీరు తాగడానికి కూడా మనకు సమయం లేకుండా పోయింది.అలాంటప్పుడు మనం తినే ఆహారం ద్వారా అయినా శరీరానికి కావల్సిన నీరును అందించాలి. రెండు లీటర్ల నీరు కచ్చితంగా తాగాలంటూ దాహం వేయకపోయినా కొందరు తాగుతుంటారు. వారు చేసే పని, ఉండే ప్రదేశం, ఆహారపు అలవాట్లు ఇలా అనేకరకాల అంశాలపై నీరు తాగడమనేది ఆధారపడి ఉంటుంది. వ్యాయామానికి ముందు, వ్యాయామం అయిన తర్వాత లేదంటే బాగా దప్పిక వేసినప్పుడు మాత్రమే నీరు శరీరానికి బాగా ఉపయోగడపతాయి. నీరు ఎంత తీసుకున్నా మంచిదే అన్న భ్రమలో ఎవరూ ఉండొద్దని, ఎక్కువ నీరు తీసుకోవద్దని, అలా తీసుకుంటే ఎన్నో అనర్థాలు కూడా ఉంటాయట. ప్రస్తుతం ఎండాకాలం కాబట్టి ఈ వేసవికాలంలో శరీరానికి తగినన్ని నీరు తీసుకోకపోతే శరీరం డిహైడ్రేషన్ కి గురవుతుంది. కాబట్టి వేసవిలో శరీరానికి తగినన్ని నీరు తాగాల్సిందే. కాబట్టి ఒక్క వేసవిలో అని మాత్రమే కాకుండా ఇతర కాలాలలో కూడా శరీరానికి సరిపడా నీరు తాగాలి. అలా అని ఎక్కువ నీరు తీసుకున్న కూడా అనేక రకాల సమస్యలు వస్తాయి. నీరు ఎంత తీసుకున్నా మంచిదే అన్న భ్రమలో ఎవరూ ఉండొద్దని, ఎక్కువ నీరు తీసుకోవద్దని, అలా తీసుకుంటే ఎన్నో అనర్థాలు కూడా ఉంటాయట. ప్రస్తుతం ఎండాకాలం కాబట్టి ఈ వేసవికాలంలో శరీరానికి తగినన్ని నీరు తీసుకోకపోతే శరీరం డిహైడ్రేషన్ కి గురవుతుంది.

# షుగర్ ఉన్నవారు బెల్లం తింటే....!




ప్రస్తుత రోజుల్లో చాలామంది డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. చిన్న పెద్ద అని వయసుతో సంబంధం లేకుండా చాలామంది ఈ డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నారు. అయితే మధుమేహం రావడానికి ప్రధాన కారణం మన ఆహారపు అలవాట్లు జీవనశైలిని అని చెప్పవచ్చు. 11 ఏళ్ల వయసు నుంచి 90 ఏళ్ళు వృద్ధుల వయసు వారి వరకు చాలామంది ఈ డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నారు. ఈ డయాబెటిస్ సమస్య పెరిగిపోవడంతో ప్రతిరోజుల్లో చాలామంది చక్కెరకు బదులుగా ఎక్కువగా బెల్లాన్ని వినియోగిస్తున్నారు. మరి మధుమేహం ఉన్నవారు బెల్లాన్ని తినవచ్చా తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. మధుమేహ వ్యాధిగ్రస్తులు బెల్లం తినవచ్చని, అయితే స్వచ్ఛమైన రూపంలో దొరికితేనే తినాలట. ప్రస్తుత రోజుల్లో స్వచ్ఛమైన బెల్లం దొరకడం అసాధ్యమని చెప్పవచ్చు. పంచదార కన్నా బెల్లమే ప్రమాదకరంగా మారిందని, బెల్లంతో చేసినవి తినడం మానేయాలని, అవసరమైతే స్వచ్ఛమైన బెల్లంతో ఇంట్లో చేసుకొని తినాలని చెబుతున్నారు వైద్యులు. మధుమేహం అనేది జీవనశైలి వ్యాధి అని, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల కూడా షుగరు సంక్రమిస్తోందట. విటమిన్లు, మినరల్స్, ఖనిజాల సమతుల్యత ఉన్న ఆహారాన్ని ఎవరూ తీసుకోవడం లేదని, ఇది కూడా షుగరు రావడానికి ఒక ప్రధాన కారణమవుతోందని అంటున్నారు వైద్యులు. ఆధునిక కాలంలో ప్రజల జీవనశైలి మారిపోతోంది. ఇష్టమొచ్చిన సమయానికి నిద్రపోయి ఇష్టమొచ్చిన సమయానికి లేస్తున్నారు. దీనివల్ల వ్యాయామం కూడా చేయడం లేదు. మధుమేహ వ్యాధి రావడానికి ఇది కూడా ఒక కారణమవుతోంది. విస్తృతమైన కాలుష్యం కూడా మధుమేహానికి కారణమవుతోందని, స్వచ్ఛమైన గాలి లేకపోవడం కూడా ఒక కారణమంటున్నారు. శారీరకంగా చురుకుగా ఉండకపోవడం కూడా ప్రజలకు సమస్యగా మారుతోంది. దీనివల్ల కూడా మధుమేహం వస్తోంది. కాబట్టి జీవనశైలి ఆహారము అలవాట్లు మార్చుకోవాలి. అలాగే శారీరక శ్రమ తప్పనిసరి.

# అల్లం టీ ఎంత మంచిదో తెలుసా?




అల్లం టీ ఎంత మంచిదో తెలుసా?అల్లం సువాసన ఒత్తిడి నుంచి మంచి ఉపశమనం కలిగిస్తుంది. అల్లం టీ తాగడం వల్ల విశ్రాంతిని, మానసిక స్థితిని మెరుగుపరుస్తుందని కొందరు పరిశోధకులు కనుగొన్నారు.కొన్ని అధ్యయనాల్లో అల్లం అధిక ఆకలిని తగ్గిస్తుందని తేలింది. ద్వారా బరువును అదుపులోకి ఉంచుకోవచ్చు. సమతుల్య ఆహారం, వ్యాయామాలతో పాటు అల్లం టీ తాగడం వల్ల బరువు వేగంగా తగ్గించడంలో సాయపడుతుంది.అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అల్లం టీ తాగడం వల్ల శరీరాన్ని ఇన్‌ఫెక్షన్‌లను నివారించగలదు. రోగనిరోధకశక్తిని మెరుగుపరచడంలో సాయపడుతుంది.అల్లం రక్తంలో చక్కెర స్థాయిలపై తగ్గించగల గుణాలు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అల్లం టీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. మధుమేహం ఉన్న వారి అల్లం టీ చాలా ప్రయోజనంగా ఉంటుంది.రక్త ప్రసరణను మెరుగుపరచడానికి చాలా అల్లం బెస్ట్ అని చెప్పవచ్చు. గుండె ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మెరుగైన రక్త ప్రసరణ కూడా రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడుతుంది.అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కండరాల నొప్పిని తగ్గించడంలో సాయపడతాయి. అల్లం టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల కండరాల అసౌకర్యం ఉన్నవారికి మంచి ప్రయోజనకరంగా ఉంటుంది.అల్లం టీ మోషన్ సిక్‌నెస్, గర్భధారణ సమయంలో మార్నింగ్ సిక్‌నెస్, శస్త్రచికిత్స అనంతరం కలిగే వికారంను తగ్గించే సామర్థ్యం ఉంది.ఆహారం చక్కగా అరిగేలా జీర్ణక్రియకు సహాయపడుతుంది.అయితే అల్లం టీని మాత్రం ఎక్కువ కాకుండా కేవలం మితంగా మాత్రమే తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అల్లం టీ తాగడం వల్ల శరీరాన్ని ఇన్‌ఫెక్షన్‌లను నివారించగలదు. రోగనిరోధకశక్తిని మెరుగుపరచడంలో సాయపడుతుంది.అల్లం రక్తంలో చక్కెర స్థాయిలపై తగ్గించగల గుణాలు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

# గోర్లు కొరకడం వల్ల.. ఇన్ని అనారోగ్య సమస్యలా..!!



చాలా మందికి జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతూ ఉంటాయి. ఇలాంటి పరిస్థితులలో మనం ఆరోగ్యం పైన శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది.ముఖ్యంగా మన గోర్లలో ఎన్నో రకాల బ్యాక్టీరియాలు కూడా ఉంటాయని వైద్యుల సైతం తెలియజేస్తూ ఉంటారు..సాధారణంగా మనం రోజు మొత్తంలో చేతులను చాలాసార్లు ఎక్కడెక్కడో తాకుతూ ఉంటాము. ముఖం నుంచి శరీర భాగాలకు వరకు తాకుతూనే ఉంటాము.. అయితే ఇలా అందమైన గోర్ల క్రింద లక్షలాది సూచన క్రిములు కూడా నివసిస్తుంటాయని విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ముఖ్యంగా గోర్ల కింద 32 రకాల బ్యాక్టీరియాలో 28 రకాల ఫంగస్ లు వ్యాపింప చేసేటువంటి ఉంటాయని ఒక పరిశోధనలో తెలియజేశారు. ఈ పరిశోధన 2021లో జరిగింది.. కొంతమంది గోర్ల కింద నుంచి శాంపుల్స్ తీసుకొని పరీక్షించగా అందులో ఇవి బయటపడ్డాయట అయితే ఇందులో 50% నమూనాలు బ్యాక్టీరియా మాత్రమే ఉందని..6.3% ఫంగస్ను కలిగి ఉందని..43.7% బ్యాక్టీరియా ఫంగస్ మిశ్రమాలలోని సైతం కలిగి ఉన్నాయని తెలియజేశారు. ముఖ్యంగా కాలి గోర్లలో కూడా ఈ బ్యాక్టీరియా ఉంటుందని వెల్లడించారు.. అందుకే గోర్లు చేతులు చాలా శుభ్రపరమైనవి గా ఉంచుకోవాలి.ముఖ్యంగా మనం తినడానికి ముక్కు తుడుచుకోవడానికి లేదా ఎవరైనా కౌగిలించుకోవడానికి మన చేతులను ఉపయోగిస్తాము.. అటువంటి పరిస్థితులలో గోర్లు శుభ్రంగా ఉండాలి.. అయితే పరిశోధకులు తెలుపుతున్న సమాచారం ప్రకారం గొర్ల కింద ఉండే బ్యాక్టీరియా ఫంగస్ వంటివి హాని చేయవని తెలియజేస్తున్నారు. యితే కొన్ని సందర్భాలలో ఈ సూక్ష్మక్రియలు చాలా బలహీనమై ఇమ్యూనిటీ పవర్ ఉన్నవారిలో ఏదైనా గాయం లేదా ఇన్ఫెక్షన్ సోకిన వారిలో ఈజీగా ప్రవేశిస్తాయని తెలుపుతున్నారు.. దీనివల్ల గోర్లు రంగు మారడం వాపు చీమునొప్పి వంటివి వస్తాయట. గోర్లను క్రమం తప్పకుండా కత్తిరిస్తూ ఉండాలి.




# సాహస యాత్రకు సిద్ధం

రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా ఆఫ్రికన్ జంగిల్ అడ్వెంచర్ నేపథ్యంలో పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడు సెట్స్‌మీదకు వెళ్తుందోనని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల జపాన్‌లో అక్కడి ప్రేక్షకులతో కలిసి 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని వీక్షించిన రాజమౌళి స్థానిక మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ను అందించారు. మహేష్‌బాబు చక్కటి ప్రతిభ కలిగిన నటుడని, హ్యాండ్సమ్‌గా ఉంటాడని రాజమౌళి కితాబిచ్చాడు. 'మహేష్‌బాబుతో సినిమా చేయబోతున్నా. మీకు కూడా ఆయన గురించి తెలిసే ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో షూటింగ్‌ను ప్రారంభించి, సాధ్యమైనంత వేగంగా చిత్రాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాం' అని రాజమౌళి తెలిపారు. తాజా అప్‌డేట్‌తో అభిమానులు సంబరపడిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మే నెలలో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకురానున్నారని తెలిసింది. 'ఆర్ఆర్ఆర్' చిత్రం గత ఏడాది జపాన్‌లో విడుదలైంది. అక్కడ కూడా ప్రేక్షకులు అద్భుతమైన ఆదరణ కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులను కలిసేందుకు రాజమౌళి ఇటీవల జపాన్‌కు వెళ్లారు.



# సమంత సిటడెల్ టైటిల్ లుక్ వైరల్..

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ బ్యూటీల్లో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. తన అందం, అభినయంతో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న సామ్ ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. సామ్ ప్రస్తుతం బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్‌తో కలిసి సిటడెల్ వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. సిటడెల్ ఇండియన్ వెర్షన్‌గా వస్తున్న ఈ వెబ్ ప్రాజెక్ట్‌కు రాజ్ డీకే దర్శకత్వం వహిస్తున్నాడు. 2024 కంటెంట్ ఎలా ఉండబోతుందో తెలియజేసేందుకు ముంబైలో గ్రాండ్ ఈవెంట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వెబ్ సిరీస్ టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు **Citadel: Honey Bunny** టైటిల్‌ను ఫైనల్ చేశారు. ఈ వెబ్ మూవీకి రాజ్ &డీకే, సీతా మీనన్ కథనందించారు. హృదయాన్ని కదిలించే ప్రేమకథతో స్పై యాక్షన్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో సాగనున్నట్టు మేకర్స్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈవెంట్‌లో సమంత వెబ్‌సిరీస్‌లో కేకే మీనన్, సిమ్రన్, సోహం మజుందార్, శివంకిత్ పరిహార్, కశ్వీ మజుందార్, సాఖిబ్ సలీం, సికిందర్ ఖేర్ కీలక పాత్రల్లో నటించారు. రాజ్ & డీకే **D2R Films** బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. సమంత **Tralala Moving Pictures** పేరుతో హోం ప్రొడక్షన్ హౌస్‌ను స్థాపించిన విషయం తెలిసిందే. నా ప్రొడక్షన్ హౌస్‌ని ప్రకటించినందుకు సంతోషిస్తున్నా. సామాజిక అంశాలు, వాటి సంక్లిష్టత గురించి మాట్లాడే కథలను ఆహ్వానించే, వాటిని ప్రోత్సహించే ప్లాట్‌ఫాం ఇది. చిత్రనిర్మాతలు అర్థవంతమైన, ప్రామాణికమైన, విశ్వవ్యాప్తమైన కథలను చెప్పడానికి ఒక వేదిక. కొత్త తరం ఆలోచనలు, భావోద్వేగాలను ప్రతిబింబించే కంటెంట్‌ను అందించడమే **Tralala Moving Pictures** ఉద్దేశం. నాకు ఇష్టమైన పాటల్లో ఒకదాని నుండి ప్రేరణ పొందిన.. బ్రౌన్ గర్ల్ ఇప్పుడు పోటీలో ఉంది.. తన ప్రొడక్షన్ హౌస్ ఉద్దేశాన్ని చెప్పకొచ్చింది.



# పాత్రలతో ప్రయోగాలు చేస్తున్నా

ప్రేమమ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది మలయాళీ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. ఆ తర్వాత తెలుగులో యువ హీరోలతో కలిసి నటిస్తూ సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. కొంతకాలంగా యువతను ఆకట్టుకునే కొత్తదనంతో కూడిన కథలను ఎంచుకుంటూ సక్సెస్ ట్రాక్‌పై వెళ్తోంది. ఈ భామ ప్రస్తుతం టాలీవుడ్ యువ హీరో సిద్దు జొన్నలగడ్డ టైటిల్ రోల్‌లో నటిస్తున్న టిల్లు 2 లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. డోనరుడా ఫేం మల్లిక్‌రామ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ మార్చి 29న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా **OhMyLily** సాంగ్‌ను లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా అనుపమపరమేశ్వరన్ మాట్లాడుతూ.. టిల్లు స్క్వేర్ మనసు, ఆత్మ లిలీ. నేను అలాంటి క్రేజీ రోల్‌ను తిరస్కరించేంత పిచ్చి అమ్మాయిని కాదు. నా అభిమానులు టిల్లు 2ను ప్రేమిస్తారు. సిద్దుతో పనిచేయడాన్ని చాలా ఎంజాయ్ చేశా. నేనిప్పటివరకు చేసిన అత్యంత ప్రత్యేకమైన పాత్రల్లో ఇది కూడా ఒకటి. గత మూడేండ్లుగా నేను పాత్రలతో ప్రయోగాలు చేస్తున్నానంటూ చెప్పుకొచ్చింది అనుపమపరమేశ్వరన్ . ఇప్పటికే షేర్ చేసిన టిల్లు 2 గ్లింప్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తుండగా.. టికెటే కొనకుండా, రాధికా రాధికా పాటలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. సిద్దు, అనుపమ పరమేశ్వరన్ ట్యాక్సీ రైడ్ సీన్‌తో షురూ అయిన గ్లింప్స్ వీడియోలో.. టిల్లుకు బర్త్ డే విషెస్ చెప్పిన హీరోయిన్..గతేడాది నీ పుట్టినరోజు నువ్వెక్కడున్నావ్ అని అడుగుతుంది. ఆ తర్వాత ఫస్ట్ పార్టు సీన్లను మరోసారి చూడొచ్చు. మేం మా ఫ్రెండ్స్ అంతా కలిసి సినిమా చూసినం. నల్లమల ఫారెస్ట్.. నల్లచీర..ఏ ఫిలిం బై రాధిక.. ఏవో పాత జ్ఞాపకాలు నావి.. పాతయేగానీ తీపియైతే కావు.. అని సిద్దు చెబుతున్న డైలాగ్స్ ఇంప్రెసివ్‌గా సాగుతూ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ నిర్మిస్తోన్న ఈ మూవీకి రామ్ మిర్యాల సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో మురళీధర్ గౌడ్, ప్రణీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఆ ఎల్ఐసీ పాలసీ బోలెడన్ని లాభాలు.. తక్కువ పెట్టుబడితో నమ్మలేని రాబడి




తాజాగా ఎల్ఐసీ ఇండెక్స్ ప్లస్ ప్లాన్ అనే కొత్త పెట్టుబడి ప్రణాళికను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ వ్యక్తుల కోసం, సాధారణ ప్రీమియం చెల్లింపులను కలిగి ఉంటుంది. ఎల్ఐసీ ప్రకారం ఈ ప్లాన్ మొత్తం పాలసీ వ్యవధికి జీవిత బీమా కవరేజ్, పొదుపు రెండింటినీ అందిస్తుంది. ప్రారంభ ఐదేళ్ల లాక్-ఇన్ పీరియడ్ తర్వాత పాలసీదారులు కొన్ని షరతులలో యూనిట్లను పాక్షికంగా ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. భారతదేశంలో ఇన్సూరెన్స్ పాలసీలు అంటే అందరికీ గుర్తు వచ్చేది లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎల్ఐసీ. ఎల్ఐసీ చాలా ఏళ్లుగా భారతదేశంలో నమ్మకమైన ఇన్సూరెన్స్ కంపెనీగా అవతరించింది. తాజాగా ఎల్ఐసీ ఇండెక్స్ ప్లస్ ప్లాన్ అనే కొత్త పెట్టుబడి ప్రణాళికను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ వ్యక్తుల కోసం, సాధారణ ప్రీమియం చెల్లింపులను కలిగి ఉంటుంది. ఎల్ఐసీ ప్రకారం ఈ ప్లాన్ మొత్తం పాలసీ వ్యవధికి జీవిత బీమా కవరేజ్, పొదుపు రెండింటినీ అందిస్తుంది. ప్రారంభ ఐదేళ్ల లాక్-ఇన్ పీరియడ్ తర్వాత పాలసీదారులు కొన్ని షరతులలో యూనిట్లను పాక్షికంగా ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఎల్ఐసీ ఇండెక్స్ పాలసీ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. ఎల్ఐసీ ఇండెక్స్ బీమా ప్లాన్‌కు అర్హత పొందేందుకు వ్యక్తులు తప్పనిసరిగా కనీసం 90 రోజుల వయస్సు కలిగి ఉండాలి. వారి సమీప పుట్టినరోజు నాటికి ప్రాథమిక హామీ మొత్తాన్ని బట్టి 50 లేదా 60 సంవత్సరాల వయస్సు వరకు ఉండవచ్చు. ప్లాన్‌లోకి ప్రవేశించిన 90 రోజుల (పూర్తయిన), 50 సంవత్సరాల (పుట్టినరోజు దగ్గరి) మధ్య ఉన్న వ్యక్తుల కోసం, ప్రాథమిక హామీ మొత్తం వార్షిక ప్రీమియం కంటే 7 నుంచి 10 రెట్లు మధ్య సెట్ చేశారు.

## అదానీ లంచాలపై అమెరికా సంస్థ విచారణ..!




న్యూఢిల్లీ : భారత్‌లో ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో అనుకూలంగా వ్యవహరించేలా అదానీ గ్రూప్ లేదా గౌతం అదానీ సహా కొందరు వ్యక్తులు లంచం ఇవ్వజూపారనే ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టిందని సమాచారం. ఈ విషయమై న్యూయార్క్‌లోని యుఎస్ అటార్నీ జనరల్ ఆఫీస్, జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఫ్రాడ్ యూనిట్ విచారణ జరపుతున్నట్లు బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. దీంతో సోమవారం భారత స్టాక్ మార్కెట్లలో అదాని కంపెనీల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఎనర్జీ కంపెనీ అజ్యూర్ పవర్ గ్లోబల్ పైనా దర్యాప్తు జరుగుతుందని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. అదానీ సంస్థ లేదా గౌతం అదానీతో సహా కంపెనీకి చెందిన వ్యక్తులు ఇంధన ప్రాజెక్ట్‌పై అనుకూలమైన నిర్ణయాల కోసం భారత్‌లోని అధికారులకు డబ్బు చెల్లించడంలో పాలుపంచుకున్నారా..? అనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. అమెరికాలో అదానీ గ్రూప్ లిస్టింగ్ కానప్పటికీ అక్కడి కంపెనీలు అదానీ గ్రూపులో పెట్టుబడులను కలిగి ఉన్నందున అక్కడి సంస్థలు దర్యాప్తు జరపడానికి వీలుంది. కాగా.. తమ ఛైర్మన్‌పై ఎలాంటి విచారణ జరుగుతున్నట్లు తమకు సమాచారం లేదని అదాని గ్రూప్ తెలిపింది. ఈ రిపోర్ట్‌తో అదానీ గ్రూపులోని 10 స్టాక్స్ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇంట్రాడేలో అదాని ఎంటర్‌ప్రైజెస్ 4 శాతం నష్టపోయింది. తుదకు 0.71 శాతం నష్టంతో రూ.3,110 వద్ద ముగిసింది.

## భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు




**ముంబై :** అంతర్జాతీయ సూచీల ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. మంగళవారం ఉదయం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. నేటి ఉదయం 9.22 సమయంలో సెన్సెక్స్ 410 పాయింట్లు పతనమై 72,337 వద్ద, నిఫ్టీ 109 పాయింట్లు కుంగి 21,946 సమీపంలో కొనసాగుతున్నాయి. రూపాయ విలువ 2 పైసలు బలహీనపడి రూ.82.93గా ఉంది. పిరమాల్, ధనీ సర్వీసెస్, ఐవోఎల్ కెమికల్స్, కేపీఐ గ్రీన్ ఎనర్జీ, హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ షేర్లు లాభాల్లో ఉండగా.. టాటా ఇన్వెస్ట్‌మెంట్, డీబీ రియల్టీ, మైక్రోటెక్ డెవలపర్స్, స్టార్ హెల్త్, టీసీఎస్ షేర్లు భారీగా కుంగాయి. ఐటీ రంగం వృద్ధిరేటు పరిమితంగా ఉంటుందని ఇక్రా నివేదిక ఇవ్వడం సూచీలపై ప్రభావం చూపింది. బ్యాంక్ ఆఫ్ జపాన్ 2007 తర్వాత తొలిసారి వడ్డీ రేట్లను పెంచింది. దీన్ని సున్నా నుంచి 0.1శాతం చేసింది. అంతేకాదు.. ఈల్డ్ కర్వ్ కంట్రోల్ విధానాన్ని రద్దు పర్చింది. ఆస్ట్రేలియా సూచీ మినహా ప్రధాన ఆసియా మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

## ఐడీబీఐపై ఫెయిర్‌ఫాక్స్ కన్ను




**ముంబై :** పీఎస్‌యూ.. ఐడీబీఐ బ్యాంక్ కొనుగోలుకి కెనడియన్ పీఈ దిగ్గజం ఫెయిర్‌ఫ్యాక్స్ ఇండియా హోల్డింగ్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం నగదు రూపేణా చెల్లించేందుకు డీల్ కుదుర్చుకోవడం ద్వారా బ్యాంకును సొంతం చేసుకునేందుకు ఫెయిర్‌ఫాక్స్ అధినేత బిలియనీర్ ప్రేమ్ వత్సా ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివరాల ప్రకారం కొనుగోలు తదుపరి సైతం బ్యాంక్ గుర్తింపును కొనసాగించేందుకు అంగీకారాన్ని తెలపనుంది. రెండు వారాల క్రితమే ఆర్థిక శాఖకు ఫెయిర్‌ఫాక్స్ తాజా ప్రతిపాదనలు చేరాయి. నిజానికి షేర్ల మార్పిడి ద్వారా బ్యాంకు కొనుగోలు ఒప్పందానికి పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నప్పటికీ ప్రభుత్వం ఇందుకు సన్నద్ధంగా లేదు. దీంతో నగదు చెల్లింపును ఫెయిర్‌ఫాక్స్ తెరపైకి తీసుకువచ్చింది. కెనడా, భారత్‌ల మధ్య రాజకీయ విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యత ఏర్పడినట్లు బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశీయంగా సీఎస్‌బీ బ్యాంక్‌కు ఫెయిర్‌ఫాక్స్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తోంది. ఫలితంగా ఐడీబీఐను సొంతం చేసుకుంటే సీఎస్‌బీ ప్రమోటర్‌గా కొనసాగేందుకు వీలుండదు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఒక ఇన్వెస్టర్ రెండు బ్యాంకులకు ప్రమోటర్‌గా వ్యవహరించేందుకు అనుమతి లభించదు. వెరసి ఐడీబీఐలో సీఎస్‌బీ బ్యాంకును విలీనం చేయవలసి ఉంటుంది. ఐడీబీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 90,440 కోట్లుకాగా.. సీఎస్‌బీ విలువ రూ. 6,000 కోట్లు మాత్రమే. కొంతకాలం ఐడీబీఐను విడిగా కొనసాగించాక తదుపరి దశలో సీఎస్‌బీ బ్యాంకులో విలీనం చేసేందుకు గతంలో ఫెయిర్‌ఫాక్స్ ప్రతిపాదించింది. అయితే విస్తారిత కార్యకలాపాలు కలిగిన ఐడీబీఐ బ్యాంక్ గుర్తింపు రద్దుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ప్రతిపాదనలను తాజాగా సవరించింది. ఐడీబీఐ బ్యాంకులో సీఎస్‌బీ విలీనానికి ప్రతిపాదించడం ద్వారా ప్రభుత్వం, ఆర్‌బీఐ నుంచి సమ్మతిని పొందే ప్రయత్నాల్లో ఉంది. వాటా విక్రయానికి ప్రభుత్వం తెరతీశాక ఐడీబీఐ బ్యాంక్ షేరు రూ. 60 నుంచి రూ. 84 వరకూ బలపడింది. ఈ నేపథ్యంలో ఐడీబీఐపై కన్నేసిన కొటక్ మహీంద్రా బ్యాంక్.. సవరించిన ఆఫర్ ద్వారా ఫెయిర్‌ఫాక్స్‌కు చెక్ పెడుతుందా లేదా అనేది వేచిచూడవలసి ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ వివరాల ప్రకారం కొనుగోలు తదుపరి సైతం బ్యాంక్ గుర్తింపును కొనసాగించేందుకు అంగీకారాన్ని తెలపనుంది. రెండు వారాల క్రితమే ఆర్థిక శాఖకు ఫెయిర్‌ఫాక్స్ తాజా ప్రతిపాదనలు చేరాయి.

## అవును నేను డ్రగ్స్ తీసుకున్నా.. టెస్లా నిర్వహణకు ఇది ఎంతగానో ఉపయోగపడింది : ఎలాన్ మస్క్




తరచూ డ్రగ్స్ తీసుకుంటున్నారంటూ తనపై వచ్చిన ఆరోపణలపై అమెరికన్ టైకూన్, టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ మరోసారి స్పందించారు. మాదకద్రవ్యాలను వినియోగించినట్లు తాజాగా అంగీకరించారు. డిప్రెషన్ వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్యుడి సూచనల మేరకు కెటమిన్ అనే డ్రగ్‌ను తీసుకున్నట్లు తెలిపారు. టెస్లా కంపెనీ నిర్వహణలో డ్రగ్స్ వినియోగం తనకు ఉపయోగపడిందని ఆయన వెల్లడించారు గతంలో ఓ సారి మానసిక కంగుబాటుకు గురైనట్లు మస్క్ చెప్పారు. ఆ సమయంలో దాన్నుంచి బయటపడేందుకు కెటమిన్ తనకు చాలా ఉపయోగపడిందన్నారు. వైద్యుడి సూచన మేరకు వారానికి ఒకసారి చిన్న మొత్తంలో దాన్ని తీసుకునేవాడినని వెల్లడించారు. 'రోజుకు 16 గంటలు పనిచేస్తుంటాను. దాంతో నాపై తీవ్ర ఒత్తిడి ఉండేది. నేను ఎక్కువ కాలం మానసిక కుంగుబాటులో ఉంటే టెస్లా పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. దాన్ని అధిగమించేందుకు కెటమిన్ తీసుకున్నా' అని వెల్లడించారు. ఒకవేళ ఎవరైనా కెటమిన్‌ను ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఏ పనీ సక్రమంగా పూర్తి చేయలేరని మస్క్ తెలిపారు. కాగా, తాను డ్రగ్స్ తీసుకున్నట్లు మస్క్ అంగీకరించడం ఇది రెండోసారి. గతంలో కూడా ఆయన ఈ అంశంపై మాట్లాడారు. రోగన్‌తో కలిసి గతంలో ఓసారి డ్రగ్స్ సేవించిన విషయం నిజమేనని అప్పట్లోనే చెప్పారు. ఆ తర్వాత తాను డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం చేశారు. నాసా అభ్యర్థనతో టెస్లా ఆఫీసును డ్రగ్స్ రహితంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆ అభ్యర్థన మేరకు గత మూడేళ్లుగా తాను వైద్య పరీక్షలు కూడా చేయించుకుంటున్నట్లు తెలిపారు.

## గతేడాదితో పోలిస్తే ఈసారి ఉద్యోగుల జీతం ఎంత పెరగనుంది? సర్వే ఏం చెబుతోంది!




మార్చి నెల ముగియడానికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులు తమ జీతాల పెంపు కోసం ఎదురుచూస్తున్నారు. మార్చి 31, 2024 చివరి నాటికి కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలలో మదింపు ఫారమ్‌ల నింపడం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత జీతాల పెంపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏప్రిల్‌లో జీతం పెంపుపై ఉద్యోగులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెల ముగియడానికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులు తమ జీతాల పెంపు కోసం ఎదురుచూస్తున్నారు. మార్చి 31, 2024 చివరి నాటికి కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలలో మదింపు ఫారమ్‌ల నింపడం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత జీతాల పెంపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏప్రిల్‌లో జీతం పెంపుపై ఉద్యోగులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈసారి మీ జీతం ఎంత పెరుగుతుందో తెలుసా? ఇంక్రిమెంట్ ఎంత అవుతుంది? ఇప్పుడు దీనికి సంబంధించి సర్వే వచ్చింది. ఆ వివరాలు ఏంటో తెలుసుకుందాం. కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఇటీవలి సర్వే ప్రకారం.. భారతదేశంలో సగటు జీతం పెంపు 2024లో 9%గా ఉండవచ్చు. ఇది గత సంవత్సరం 9.2% కంటే స్వల్పంగా తక్కువ. డెలాయిట్ ఇండియా టాలెంట్ ఔట్‌లుక్ 2024 సర్వే కూడా దేశంలోని ప్రతి మూడింటిలో ఒకటి ఈ ఏడాది రెండంకెల వేతనాలు చెల్లించాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది. అయితే సగటు జీతం పెంపు గతేడాది కంటే తక్కువగా ఉంది. బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ /నాలెడ్జ్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ మినహా అన్ని రంగాలలో 2024 జీతాల పెంపు అంచనాలు కోవిడ్-పూర్వ స్థాయిల కంటే ఎక్కువగా ఉన్నాయి.

## దీర్ఘకాలంలో చిన్న, మధ్య షేర్లు బలంగానే...



**కోల్‌కతా :** చిన్న, మధ్య స్థాయి షేర్ల విలువలు మరీ అధిక స్థాయికి చేరాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చేసిన వ్యాఖ్యలతో ఈ షేర్లు గత 3 వారాల్లో భారీగా కుదేలయ్యాయి.అయితే విశ్లేషకులు మాత్రం ఈ షేర్లపై సానుకూలంగానే ఉన్నారు. ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాల అండతోనే షేర్ల విలువలు పెరిగాయని అంటున్నారు. స్వల్పకాలంలో చిన్న, మధ్య షేర్లలో ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉందని, దీర్ఘకాలంలో మాత్రం బుల్లిష్‌గా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. 'బలమైన మూలాలతో పాటు ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాలు, మార్కెట్లు బలంగా ఉంటే ఈ షేర్లకు ఢోకా ఉండదు' అని వాల్యూ స్టాక్స్ వ్యవస్థాపకుడు, స్మాల్‌కేస్ ఫండ్ మేనేజర్ శైలేష్ సరాఫ్ పేర్కొన్నారు. భారత వృద్ధి పరుగులు, కార్పొరేట్ ఆదాయాలు పెరగడం ఇందుకు దోహదపడొచ్చని అన్నారు. డిసెంబరు త్రైమాసికంలో కంపెనీలు మెరుగ్గా రాణించాయని వాల్యూ స్టాక్ నివేదిక తెలిపింది. 'ప్రభుత్వ రంగ సంస్థల షేర్లపై బుల్లిష్‌గా ఉన్నాం. 2023లో నిఫ్టీ 20% లాభపడగా, నిఫ్టీ పీఎస్ఈ సూచీ 77% పెరిగింది. 2024లో ఇప్పటివరకు నిఫ్టీ 3% రాణించగా, పీఎస్ఈ సూచీ 21% పరుగులు తీసింది. ఈ సూచీ పీఈ 10గా ఉండటంతో మరింత పెరిగే అవకాశం ఉంద'ని సరాఫ్ వెల్లడించారు. 2024 ఫిబ్రవరిలో నికర ఈక్విటీ పెట్టుబడులు రూ.26,866 కోట్లుగా ఉన్నాయి. వరుసగా 36వ నెలా సానుకూల ధోరణి కనిపించింది. భారత ఈక్విటీ మార్కెట్లపై మదుపర్ల విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని ప్రభుదాస్ లీలాధర్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ హెడ్ పంకజ్ శ్రేష్ఠ అన్నారు.

# బీహార్ కాంగ్రెస్ పార్టీలో పప్పు యాదవ్ పార్టీ విలీనం



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ బీహార్ కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరగనుంది. ప్రాంతీయ పార్టీ జన్ అధికార్ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం అయింది. కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంక గాంధీ హామీ మేరకు పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశామని జన్ అధికార్ పార్టీ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పుయాదవ్ ప్రకటించారు. కాంగ్రెస్, ఆర్‌జేడీ కలిసి పోటీ చేయడం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని పప్పుయాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్‌జేడీ కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పప్పుయాదవ్‌ను లోక్‌సభ ఎన్నికల బరిలో నిలపాలని కాంగ్రెస్ భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో చేరక ముందు ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ , అతని కుమారుడు తేజస్వియాదవ్‌తో పప్పు యాదవ్ సమావేశం అయ్యారు. గత 17 నెలల బీహార్ పాలనలో తేజస్వియాదవ్ మార్క్ కనిపించిందని ప్రశంసించారు.

# సిఎ పరీక్ష తేదీల్లో మార్పులు



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా తమ పరీక్షల తేదీలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) మార్చిందని అధికారులు వెల్లడించారు. చార్టర్డ్ అకౌంటెంట్ పరీక్షలు లోగడ నిర్ణయించినట్లుగా మే నెలలోనే జరుగుతాయి. కానీ పరీక్షల తేదీలను మార్చడమైంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం, గ్రూప్ 1 కోసం ఇంటర్మీడియట్ కోర్స్ పరీక్షను మే 3, 5, 9 తేదీలలో నిర్వహిస్తారు. ఇంతకుముందు ఈ పరీక్షకు నిర్ణయించిన తేదీలు మే 3, 5, 7. గ్రూప్-2 కోసం ఇంటర్మీడియట్ కోర్స్ పరీక్షను మే 11, 15, 17 తేదీలలో నిర్వహిస్తారు. ఇంతకు ముందు ఈ పరీక్షను మే 9, 11, 13 తేదీల్లో నిర్వహించాలని సంకల్పించారు. ఫైనల్ పరీక్షల కోసం గ్రూప్ 1కు మే 2, 4, 8 తేదీలను ఐసిఎఐ ప్రకటించింది. ఇంతకు ముందు ఈ పరీక్షలను మే 2, 4, 6 తేదీల్లో నిర్వహించాలని అనుకున్నారు. గ్రూప్ 2 కోసం పరీక్షను మే 10, 14, 16 తేదీలలో నిర్వహిస్తారు. ఈ పరీక్షను మే 8, 10, 12 తేదీలలో నిర్వహించాలని లోగడ నిర్ణయించారు. 18వ లోక్‌సభ ఎన్నికలను ఏప్రిల్, జూన్ కాలంలో నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ప్రకటించిన తరువాత ఈ పరీక్షల టైమ్‌టేబుల్ సవరణకు నిర్ణయం తీసుకున్నారు. 'పైన పేర్కొన్న పరీక్ష షెడ్యూల్‌లో ఏ రోజునైనా కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక పాలనాధికార సంస్థ పబ్లిక్ సెలవు దినం ప్రకటించిన పక్షంలో పరీక్ష షెడ్యూల్‌లో మార్పు ఏదీ ఉండదని ఇందుమూలంగా తెలియజేయడమైంది' అని ఐసిఎఐ పేర్కొన్నది.

# చంద్రబాబుపై పెద్దిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై వైసీపి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయ వికలాంగుడిగా అభివర్ణించారు. పొత్తులు లేకపోతే చంద్రబాబు నిలబడలేరనీ, అందితే జుట్టు అందకపోతే కాళ్ల పట్టుకునే రకమని అన్నారు. జుట్టు అందలేదు కాబట్టి బిజేపి పెద్దల కాళ్లు పట్టుకున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీకి బిజేపి, జనసేన ఊతకర్రలుగా మారాయన్నారు. ఈ మూడు పార్టీల పొత్తు తాము ముందే ఊహించామని, రానున్నఎన్నికల్లో వైసీపీ ఒంటరిగానే పోటీ చేసి, గతంలో కంటే భారీ మెజారిటీ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రైస్ మిల్లర్లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీరియస్



హైదరాబాద్: రైస్ మిల్లర్లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర చెల్లించకుంటే మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. మిర్యాలగూడలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని రైతులు కలిశారు. ధాన్యానికి మద్దతు ధర రావడంలేదని మంత్రికి రైతులు తెలపడంతో వెంటనే ఆయన మిల్లర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు మిల్లర్లు అన్యాయం చేస్తే ఊరుకోమని ఘాటుగా హెచ్చరించారు. పంటనష్టం జరిగిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కెసిఆర్ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వద్ద మోకరిల్లి కృష్ణా నీళ్లను ఆంధ్రాకు తరలించిందని మండిపడ్డారు. దక్షిణ తెలంగాణను కెసిఆర్ ప్రభుత్వం నాశనం చేసిందని దుయ్యబట్టారు.

# మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి.. ఇఫ్తార్ విందులో షబ్బీర్ అలీ



మైనారిటీల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మాజీ మంత్రి ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం నిజామాబాద్ పట్టణంలోని మాలపల్లి కాలనీ డీలక్స్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో షబ్బీర్ అలీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, హరున్ ఖాన్, ఖుద్దూస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీబీ చైర్మన్ పదవికి పోచారం భాస్కర్ రెడ్డి రాజీనామా..



నిజామాబాద్: ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు మెజారిటీ డైరెక్టర్లు వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి క్యాంపులో ఉండగా.. బలపరీక్షకు ముందుగానే బుధవారం రాత్రి తన పదవికి రాజీనామా సమర్పించారు. ఈ సందర్భంగా పోచారాం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. డీసీసీబీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి.. నాకు పార్టీ కంటే పదవి గొప్పదేమీకాదని అన్నారు.. పదవుల కోసం పార్టీలు మారడం అనైతికమన్నారు.

# పిఠాపురం ఎమ్మెల్యేగా నేనే పోటీ చేస్తా: ఎస్‌వీఎస్ఎన్ వర్మ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేస్తే పిఠాపురం ఎమ్మెల్యేగా తానే పోటీ చేస్తానని పిఠాపురం టిడిపి ఇంచార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తేనే మద్దతు ఇస్తానన్న వర్మ.. అలా కాదని పవన్ ఎంపీగా పోటీ చేస్తూ వేరే వారిని నిలబెడితే, టిడిపి నుంచి తానే బరిలోకి దిగుతానని ఎస్‌వీఎస్ఎన్ వర్మ చెబుతున్నారు. టిడిపి- బిజెపి- జనసేన పొత్తులో భాగంగా జనసేనకు రెండు ఎంపీ సీట్లు కేటాయించారు. తనను కాకినాడ నుంచి ఎంపిగా బరిలో దిగుమని బిజెపి కోరితే అందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పవన్ తెలిపారు. ఈ నేపథ్యంలో, పిఠాపురం టిడిపి ఇంచార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని ఎస్ వీఎస్ఎన్ వర్మ వెల్లడించారు.

## కేజ్రీవాల్‌కు ఇడి పదే పదే సమన్లు పంపుతోంది

# ఆప్ మంత్రి ఆగ్రహం




న్యూఢిల్లీ: ఎక్సైజ్ విధానం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ సవాల్ పిటిషన్‌పై కోర్టు నిర్ణయం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిరీక్షించకుండా ఆయనకు సమన్లు పంపుతోందని ఢిల్లీ మంత్రి ఆతిషి బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్ధ ప్రక్రియను మన్నించవలసిందిగా దర్యాప్తు సంస్థను మంత్రి కోరారు. ఎక్సైజ్ విధానంతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో తనకు జారీ అయిన సమన్లను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇడి వైఖరి తెలియజేయాలని ఢిల్లీ హైకోర్టు బుధవారం కోరింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని కొన్ని నిబంధనలను కూడా సవాల్ చేస్తున్న ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పిటిషన్ చెల్లుబాటు కాదని ఇడి వాదించింది. ఆతిషి 'పిటిఐ వీడియోస్'తో మాట్లాడుతూ, 'ఇడి పదే పదే సమన్లు పంపుతోంది. సమన్ల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కేజ్రీవాల్ పంపిన సమాధానలకు స్పందన ఏదీ లేదు. హైకోర్టులో కేజ్రీవాల్ అర్జీని ఇడి వ్యతిరేకించింది. వారు అర్జీని తిరస్కరించాలని డిమాండ్ చేశారు. కానీ, హైకోర్టు వారి స్పందన కోరింది' అని వివరించారు. తాజా సమన్ల దృష్ట్యా కేజ్రీవాల్ కోర్టును ఆశ్రయించారు. 'ఆ సమన్ల చట్టబద్ధత గురించి మేము ప్రశ్నిస్తున్నాం. ఇప్పటి వరకు ఇడి జవాబు ఇవ్వలేదు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా రౌజ్ అవెన్యూ కోర్టుకు ఇడి వెళ్లింది. కానీ కోర్టు నిర్ణయం కోసం ఇది నిరీక్షించడం లేదు. దయచేసి చట్టబద్ధ ప్రక్రియను మన్నించవలసిందని ఇడికి చెప్పాలని అనుకుంటున్నాం' అని ఆతిషి పేర్కొన్నారు.

# సిఎఎపై నిషేధం.... నీట్ రద్దు....

## మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్




చెన్నై : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం కెస్టాలిన్ బుధవారం మేనిఫెస్టోని విడుదల చేశారు. పుదుచ్చేరికి రాష్ట్రహోదా, నీట్ పరీక్షలపై నిషేధం, ముఖ్యమంత్రికి గవర్నర్‌ను నియమించే అధికారం వంటి ఇతర హామీలను మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ మేనిఫెస్టోను రూపొందించినందుకు తన సోదరి కనిమోళిని స్టాలిన్ ప్రశంసించారు. ప్రతి జిల్లాకు సంబంధించిన పథకాలపై కనిమొళి అద్భుతమైన మేనిఫెస్టోను రూపొందించారని అన్నారు. మేనిఫెస్టోతోపాటు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కూడా స్టాలిన్ ప్రకటించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రూపొందించిన మేనిఫెస్టోలో ఏం చెప్పామో డిఎంకె అదే చేస్తుంది. మా నాయకులకు అదే నేర్పాం. ద్రవిడ మోడల్ లో అమలు చేసిన పథకాలు తమిళనాడు అభివృద్ధిని దేశమంతా వ్యాప్తి చేసేలా చేస్తాయని పేర్కొన్నారు.

**మేనిఫెస్టో లోని అంశాలు**

1. రాష్ట్రాలకు సమాఖ్య హక్కులు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ
2. చెన్నైలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు
3. పుదుచ్చేరికి రాష్ట్రహోదా
4. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి ) ఉపసంహరణ
5. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు
6. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం సదుపాయం
7. నీట్‌పై నిషేధం
8. రాష్ట్రంలో టోల్‌గేట్ల తొలగింపు
9. రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఎఎ) పై నిషేధం
10. ఎల్పీజీ గ్యాస్ 500, లీటర్ పెట్రోల్ రూ. 75, డీజిల్ రూ.65 అందిస్తూ నిర్ణయం.
11. తిరుకురల్‌ను 'నేషనల్ బుక్ 'గా తీర్చిదిద్దేలా నిర్ణయం
12. దేశానికి తిరిగి వచ్చిన శ్రీలంక తమిళులకు భారత పౌరసత్వం
13. గవర్నర్‌లకు క్రిమినల్ ప్రొసీడింగ్స్ నుండి మినహాయింపునిచ్చే ఆర్టికల్ 36ల1 సవరణ
14. కొత్త ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈ, ఐఐఏఆర్ఐలు ఏర్పాటుతో పాటు ఇతర హామీలు నెరవేర్చేలా మేనిఫెస్టోని సిద్ధం చేసిన డీఎంకే

**డిఎంకె లోక్‌సభ అభ్యర్థులు వీరే**

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న 21 మంది అభ్యర్థుల జాబితాను సిఎం స్టాలిన్ విడుదల చేశారు. వారిలో డీఎంకే పార్టీలో కీలకనేతలైన కె కనిమొళి, ఎ రాజా, బాలు తదితరులు ఉన్నారు. వీరు కాక మిగతా 18 మందిలో పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, విసికె పార్టీ అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 21 మందిలో 11 మంది కొత్తవారు కాగా, వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. వీరిలో ప్రస్తుత దక్షిణ చెన్నై, ఎస్ ఎంపి తమిజాచి తంగపాండ్యన్ సెంట్రల్ చెన్నై దయానిధి మారన్, శ్రీ పెరంబుత్తూరు టీఆర్ బాలు, అరకోణం జగత్రాచహన్, వెల్లూరు కందిర్ ఆనంద్ లను బరిలోకి దించాలని పార్టీ నిర్ణయించింది. వీరితోపాటు తిరువనమలై అన్నాదురై, ఆరణిధరణి, సేలంసెల్వగపతి, ఈరోడ్ ప్రకాష్, నీలగిరి ఏ రాజా, కోవై గణపతి రాజ్‌కుమార్, పెరంబుదూరు అరుణ్ నేరు, తంజావూరు మురసోలి, తేని తంగ తమిల్ సెల్వం, తుత్తుకుడి కనిమొళి, తెంకాసికాటిచ కళ్లకురిచి మలైయరసన్ పోటీలో ఉన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో 5348 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్.. త్వరలోనే నోటిఫికేషన్!



హైదరాబాద్: వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో 5,348 పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్చి 16న ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన సీవీని విడుదల చేశారు. పబ్లిక్ హెల్త్, ఆయుష్, డీసీఏ, ఐపీఎం, డీఎంఈ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో ఖాళీల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు నేరుగా ఈ పోస్టులను భర్తీ చేస్తుంది. రాష్ట్రంలో ఉన్న 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 2021 అక్టోబర్ నుంచి ఖాళీగా ఉన్న 4356 పోస్టులను కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలని ఆర్థిక శాఖ ఆదేశించింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com